




గంజాయ్.. యువత జోగుతోంది. ఆ మత్తులో నేరాలకు పాల్పడుతోంది. చదువుకునే విద్యార్థులు కూడా బానిసలుగా మారారు. గతంలో ఎక్కడో మారుమూల రహస్యంగా తాగడం, విక్రయించడం జరిగేది. కానీ వైసీపీ హయాంలో గంజాయి తాగడం, విక్రయించడం అనేవి విచ్చలవిడిగా మారాయి. గొడవలు, ఘర్షణలు చివరకు హత్యలు, అత్యాచారాలకు గంజాయే కారణమని పలువురు వాపోయినా నాటి పాలకులకు పట్టలేదు. ప్రస్తుతం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం గంజాయి మహమ్మారిని ఓ సవాల్‌గా స్వీకరించింది. పలు ప్రాంతాల్లో ఇప్పటికే పలువురిని అరెస్టు చేసి పదుల కేజీల్లో గంజాయిని స్వాధీనం చేసుకున్నా.. ఆ మహమ్మారి ఇంకా వేళ్లూనుకునే ఉంది. నాటి ప్రభుత్వంలో గంజాయిని విచ్చలవిడి చేయగా నేడు కట్టడికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. మంగళవారం హోం మంత్రి అనిత ఎస్పీలతో దీనిపై ప్రత్యేకంగా సమీక్షించారు. ఎస్పీలు రంగంలోకి దిగి గంజాయి మత్తును వదిలించాలని ఆదేశాలు జారీ చేశారు.

కొరవడిన తనిఖీలు

గతంలో గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టేది. వైసీపీ ప్రభుత్వం ఎస్‌ఈబీ పేరుతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి హడావుడి చేయడం తప్ప మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యలేవీ లేవు. గతంలో ఎక్సైజ్, పోలీస్ శాఖలే సమర్థవంతంగా గంజాయి విక్రయాన్ని నియంత్రించాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎక్కడికక్కడ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, వారం వారం తనిఖీలు నిర్వహించి గంజాయి, తదితర మత్తు పదార్థాలను పట్టుకునేవారు. అక్రమార్కులు ఎప్పటికప్పుడు కొత్త పద్ధతుల్లో గంజాయిని తరలించడానికి ప్రయత్నించినా ప్రభుత్వ యంత్రాంగం కన్నుగప్పి తరలించడం సాధ్యమయ్యేది కాదు. కానీ వైసీపీ వచ్చాక నేరుగా అధికార పార్టీ నేతలు, కార్య కర్తలే ఈ అక్ర మాల్లో భాగ స్వాములయ్యా రు. దీంతో అధికారులు కూడా చూసీ, చూడనట్లు వ్యవహరించడం మొదలుపెట్టారు. ఫలితంగా గడిచిన ఐదేళ్లలో ఉమ్మడి గుంటూరు జిల్లా గంజాయి హబ్‌లా మారిపోయింది.

కేసులు పెట్టినా.. తగ్గేదేలేదు

రెండు మూడు నెలల్లో పదుల సంఖ్యలో కేసులు నమోదు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే అంత వరకు గంజాయి విషయంలో పట్టీపట్టనట్లుగా ఉన్న పోలీసులు జూలు విదిల్చారు. గంజాయి విక్రయాలను కట్టడి చేసేందుకు దాడులు, అరెస్టులకు రంగంలోకి దిగారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ప్రతి రోజూ పదుల సంఖ్యలో గంజాయి కేసులు నమోదవుతూనే ఉన్నాయి. పోలీసులు కేసులు పెట్టడం, నిందితులను అరెస్టు చేయడం, మళ్లీ గంజాయి విక్రయాలు జరగడం, మళ్లీ అరెస్టులు చేయడం.. సర్వసాధారణంగా మారింది. కేసులు పెడుతున్నా గంజాయి విక్రయాలు మాత్రం తగ్గడం లేదు. కేసుల దారి కేసులదే.. తమ దారి తమదే అన్నట్లుగా గంజాయి విక్రయదారులు చెలరేగి పోతున్నారు.



ఎయిమ్స్ ఆసుపత్రికి వెళ్లే మార్గంలో ముగ్గురు యువకులను అరెస్టు చేసిన పోలీసులు (ఫైల్)

ఎమ్మెల్యేలకు ఫిర్యాదులు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యేలు నియోజకవర్గ పర్యటనల్లో గంజాయి సమస్యపై ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు. ఏ ప్రాంతానికి వెళ్లినా గంజాయి గురించే ప్రజలు ఎమ్మెల్యేల ఎదుట గోడు వెళ్లబోసుకుంటున్నారు. గంజాయి మత్తులో ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయని వివరిస్తున్నారు. మొత్తం మీద కూటమి ఎమ్మెల్యేలకు గంజాయి సమస్య షాకుల మీద షాకులు ఇస్తోంది. స్థానిక సమస్యల కంటే అధిక సంఖ్యలో గంజాయి సమస్యపై ఎమ్మెల్యేలకు ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో గంజాయి నియంత్రణ కోసం ఎమ్మెల్యేలు, పోలీసు యంత్రాంగం ఎన్ని చర్యలు తీసుకున్నా గంజాయి విక్రేతలు సవాలు విసురుతున్నారు. గంజాయి సమస్య పరిష్కారం కోసం ఏకంగా జిల్లా ఎస్పీలకు ఎమ్మెల్యేలు కూడా ఫిర్యాదులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

గంజాయి.. సవాల్

నాడు విచ్చలవిడి.. నేడు కట్టడికి చర్యలు

- వైసీపీ హయాంలో విస్తరించిన మహమ్మారి
- గంజాయిమయంగా ఉమ్మడి గుంటూరు జిల్లా
- విద్యాసంస్థలు సహా అన్ని చోట్ల యథేచ్ఛగా విక్రయాలు
- రోజూ పదుల సంఖ్యలో కేసులు నమోదు.. పలు అరెస్టులు
- హోంమంత్రి అనిత సమీక్షతోనైనా గంజాయి మత్తు వదిలేనా

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో గంజాయి పడగ విప్పి బుసలు కొడుతోంది. పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా అంతటా మహమ్మారి విస్తరించింది. వైసీపీ హయాంలో గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల విక్రయాలపై కనీసస్థాయి నియంత్రణ కూడా లేకపోవడంతో ఎక్కడంటే అక్కడ గంజాయి విక్రయాలు జరుగుతున్నాయి. చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి ఒక్కో ప్యాకెట్‌ను రూ.200కి విద్యార్థులకు విక్రయిస్తున్నారు. కళాశాల సమీపంలో ఉండే చిన్న చిన్న బడ్డీ కొట్లు, కూడళ్లను కేంద్రంగా చేసుకుని గంజాయి విక్రేతలు చెలరేగిపోతున్నారు. సాక్షాత్తూ మాజీ ముఖ్యమంత్రి నివాసం ఉంటున్న తాడేపల్లి గంజాయి విక్రయాలకు కేంద్ర బిందువుగా మారినా నాటి పాలకులకు పట్టలేదు. అత్యాచారాలు, హత్యలు చోటుచే సుకున్నా ప్రభుత్వంలో స్పందనలేదు. మంగళగిరి, తాడేపల్లిలో స్కూలు, కళాశాల స్థాయి విద్యార్థులను సైతం గంజాయి విక్రేతలు వదల్లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కిందటేడాది తాడేపల్లి మండలం పెనుమాక గ్రామానికి చెందిన ముగ్గురు ఇంటర్మీడియట్ విద్యార్థులు గంజాయి మత్తులో కృష్ణాయపాలెం వంతెన వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి అక్కడికక్కడే మరణించారు. కాగా గుంటూరులో గంజాయి దొరకని వీధి లేదంటే ఆశ్చర్యం లేకపోవచ్చు. ప్రతి డివిజన్లో ఏదో మూల గంజాయి దొరుకుతోంది. స్వర్ణభారతినగర్ ప్రాంతంలో గంజాయి విక్రయాలపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని ఎన్నికలకు ముందు ఓ మహిళ ఢిల్లీకి వెళ్లి బొటన వేలు కోసుకున్న విషయం తెలిసిందే. వైసీపీకి చెందిన ఓ ఎమ్మెల్యే కనుసన్నల్లోనే ఈ మహమ్మారి గుంటూరులో అల్లుకుపోయిందని అధికారపార్టీ ఎమ్మెల్యేలు ఆరోపించినా నాటి ప్రభుత్వంలో స్పందనలేదు. పల్నాడు జిల్లాలో సత్తెనపల్లి, అమరావతి, క్రోసూరు, నరసరావుపేట, పిడుగురాళ్లలో మైదాన ప్రాంతాల్లో కూడా గంజాయి విచ్చల విడిగా దొరుకుతోంది. బాపట్ల జిల్లా సూర్యలంకలో పర్యా టక ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో, చీరాల నియోజకవర్గంలోని తీర ప్రాంత గ్రామాల్లో గంజాయి విచ్చల విడిగా దొరుకుతోంది. ఒకప్పుడు నాటుసారా విక్రయాలు ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో ఇప్పుడు గంజాయి యథేచ్ఛగా అందుబాటులో ఉంది. బాపట్ల, చీరాలలోని విద్యా సంస్థలను టార్గెట్ చేసి గంజాయి విక్రేతలు విద్యార్థులను గంజాయికి బానిసలుగా చేస్తున్నారు. వీటిపై దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం, అధికార యం త్రాంగం గంజాయి నిర్మూలనకు ప్రయత్నిస్తోంది. కానీ గంజాయి అడుగడుగునా సవాలు విసురుతోంది. ఈ పరిస్థితుల్లో మంగళవారం హోంమంత్రి అనిత ఎస్పీలతో జరిగిన సమీక్షలో గంజాయి కట్టడి ప్రధాన అంశమైంది. గంజాయి మత్తును వదిలించేందుకు కఠిన చర్యలు తీసు కోవాలని ఎస్పీలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ పరిస్థితు ల్లో గంజాయి కట్టడి అవుతుందని ప్రజలంతా ఎదురు చూస్తున్నారు.



సీతానగరం పుష్కర ఘాట్ల వద్ద పోలీసులు అరెస్టు చేసిన గంజాయి విక్రయదారులు (పాతచిత్రం)

- సరిగ్గా వారం క్రితం మంగళగిరిలోని ఎయిమ్స్ సమీపంలో పోలీసు అధికారులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు విక్రేతలను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు వారం ముందు తాడేపల్లిలో భారీ స్థాయిలో గంజాయిని, విక్రయించే వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.
- వారం క్రితం సత్తెనపల్లిలో గంజాయి విక్రయిస్తున్న ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడు కిలో గంజాయిని రూ.3 వేలకు విక్రయిస్తున్నాడు. అమరావతి మండలం దిడుగు గ్రామానికి చెందిన ఒకరి వద్ద 10 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. క్రోసూరు మండలం హసనాబాద్‌లో ఓ మహిళ వద్ద 300 గ్రాముల గంజాయి దొరికింది.

అరెస్టుల పరంపర ఇలా..

- నెల రోజుల క్రితం పల్నాడు జిల్లా మాచర్లలో 32 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. సాగర్ చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో భారీ మొత్తంలో గంజాయి దొరికింది.
- ఈ నెల 14న పెనుమూడి వంతెన వద్ద గంజాయి విక్రయిస్తున్న 10 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అంతకు ముందు మార్చిలో 457 కేజీల గంజాయిని బాపట్ల శివారులో పోలీసులు పట్టుకున్నారు.



తెనాలి : గంజాయితో పట్టుబడిన నిందితుల వివరాల వెల్లడిస్తున్న డీఎస్పీ రమేష్, సీఐలు (ఫైల్)

హాస్టళ్ల నిర్వహణ ఇష్టారాజ్యం

- డబ్బేపరమావధిగా యాజమాన్యాల తీరు
- యథేచ్ఛగా మాదక ద్రవ్యాల వినియోగం
- విద్యార్థుల భద్రతకు.. నిబంధనలకు చెల్లుచీటి



గుంటూరు(విద్య), జూలై 30: ఒక్క గదిలో పది మంది వసతి.. గదుల మూలల్లో బీరు బాటిళ్లు, సిగిరెట్ పీకలు.. కొన్ని చోట్ల మాదక ద్రవ్యాల అనవాళ్లు.. ఇదీ మురికివాడల్లోని పరిస్థితి అనుకుంటే తప్పులో కాలేసినట్లే. ఓ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ తమ కళాశాలలో చదివే విద్యార్థులు బస చేసే హాస్టల్‌ను ఇటీవల తనిఖీ చేయగా వెలుగుచూసిన దృశ్యాలు. దీంతో సదరు ప్రిన్సిపాల్ హాస్టళ్లలో ఉండే తమ కళాశాల విద్యార్థుల జాబితా తయారు చేసి తల్లిదండ్రులకు పంపి పిల్లల్ని ఖాళీ చేయించాలని, లేకుంటే టీసీలు ఇస్తామని స్పష్టం చేశారు. తాజాగా ఢిల్లీలో ఓ కోచింగ్ సెంటర్ సెల్లార్‌లోని వర్షపునీరు వచ్చి ముగ్గురు సివిల్స్‌కు సిద్ధమయ్యే విద్యార్థులు మరణించిన విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో గుం టూరులోని ప్రైవేటు వసతిగృహాలను పరిశీలిస్తే దిగ్భ్రాంతి కరమైన విషయాలు వెలుగుచూశాయి.

భద్రత గాలిలో దీపం..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో పుట్టగొడుగుల్లా హాస్టళ్లు బాలికలు, బాలికలకు వేర్వేరుగా వెలుస్తున్నాయి. ఆయా హాస్టళ్లలో ఇంటర్ నుంచి పీజీ వరకు విద్యార్థులు వసతి పొందుతూ చదువుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో అయితే ప్రత్యేకంగా అపార్టుమెంట్లలో హాస్టళ్లను నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఒక్కో గదిలో ఐదు నుంచి 10 మంది వసతి ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా భవనాలకు కనీసం ఫైర్ సేఫ్టీ లేదు. శుద్ధమైన మంచినీరు, నాణ్యమైన ఆహారం విషయంలో అనేక ఆరోపణలు ఉన్నాయి. కొన్ని హాస్టళ్లలో సీసీ కెమెరాలు కూడా లేవు. విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తున్నా భద్రత గురించి పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థులపై నియంత్రణ లేదు. దీంతో పుట్టినరోజు పార్టీలు, ప్రత్యేక కార్యక్రమాల పేరుతో విద్యార్థుల హంగామా అంతా ఇంతాకాదు. రోడ్లపై కేక్‌లు కట్‌చేయడం, మద్యపానాలతో విద్యార్థులు చేసే హడావిడి స్థానికులకు ఇబ్బందికరంగా మారినా, ఫిర్యాదులు చేసినా పట్టించుకునే వారేలేరు. గుంటూరులోని బ్రాడీపేట, అరండల్‌పేట, బృందావన్‌గార్డెన్స్, లక్ష్మీపురం తదితర ప్రాంతాల్లో డజన్లకొద్దీ హాస్టళ్లు ఉన్నాయి. అయితే వీటికి కనీస అనుమతులు కూడా లేవు. ఫలితంగా ప్రభుత్వానికి చెల్లించాల్సిన అనేక రకాల ఫీజులు యాజమాన్యాలు చెల్లించడం లేదు. మున్సిపల్ ట్యాక్స్, విద్యుత్ చార్జీలు, నీటి పన్నులు వాణిజ్య అవసరాలకు కాకుండా ఇంటికి చెల్లించనట్లే చెల్లిస్తున్నారు. వాణిజ్యపరమైన అనుమతులు లేకపోవడంలో ప్రభుత్వం జీఎస్టీ నష్టపోతున్నట్లు ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లోపించిన పోలీసులు పర్యవేక్షణ

ప్రైవేటు హాస్టళ్లలో వసతి పొందే వారిపై పోలీసుల నిఘా లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల విద్యార్థులు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. చదివే కళాశాల అడ్మిషన్ పత్రం, ఆధార్, శాశ్వత చిరునామా తదితర వివరాలను పట్టించుకోకుండా నిర్వాహకులు ఎవరినంటే వారిని హాస్టళ్లలో చేర్చుకుంటున్నారు. పోలీసుల వద్ద కూడా తమ పరిధిలోని హాస్టళ్ల వివరాలు లేవనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో పోలీసులు తనిఖీలు చేసేవారు. గడిచిన ఐదేళ్లలో ఇటువంటి పరిస్థితులు లేవు.

తహసీల్దార్ల పోస్టింగ్‌లపై సీసీఎల్ఏ మెమో

- బదిలీల తర్వాత ఆదేశాలు నిష్ప్రయోజనమన్న ఉద్యోగులు

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ల బదిలీల విషయంలో రాష్ట్ర భూపరిపాలన ముఖ్య కమిషనర్ కార్యాలయం జారీ చేసిన మెమోతో ఉపయోగం ఏమిటన్న అభిప్రాయం రెవెన్యూవర్గాల్లో వ్యక్తమౌతున్నది. ఎన్నికల కోసం ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసీల్దార్లు గత వారంలో వారి సొంత జిల్లాలకు వచ్చి రిపోర్టు చేయగా శనివారమే కలెక్టర్లు పోస్టింగ్ ఆర్డర్స్ కూడా ఇచ్చేశారు. ఆ మేరకు చాలామంది తహసీల్దార్లు ఇప్పటికే వారికి కేటాయించిన మండలాలకు వెళ్లి విధుల్లో చేరారు. అయితే మంగళవారం సీసీఎల్ఏ కార్యాలయం నుంచి తహసీల్దార్ల పోస్టింగ్‌లకు సంబంధించి తాజా ఆదేశాలతో ఒక మెమో జారీ అయింది. దాని ప్రకారం తహసీల్దార్లను సొంత డివిజన్, గతంలో పని చేసిన ప్రదేశం, మండలం, నియోజకవర్గంలో పోస్టింగ్‌కి వీల్లేదు. ఈ నిబంధనలు అమలు చేయలేని వారి విషయంలో పూర్వ జిల్లాలను ప్రాతిపదికగా తీసుకుని పోస్టింగ్‌లు చేయాలి. ఇందుకోసం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు సంబంధించి నోడల్ అథారిటీగా గుంటూరు కలెక్టర్ ఎస్ నాగలక్ష్మిని నియమించారు. సభ్యులుగా పల్నాడు, బాపట్ల కలెక్టర్లుంటారు. మెంబర్ కన్వీనర్‌గా గుంటూరు డీఆర్‌వో వ్యవహరిస్తారు. అయితే ఈ మెమో గత వారంలో వచ్చి ఉంటే దీని ప్రకారం తహసీల్దార్లకు పోస్టింగ్‌లు చేసి ఉండేవారు. అయితే తహసీల్దార్ల పోస్టింగ్‌లు జరిగిన రెండు, మూడు రోజుల తర్వాత సీసీఎల్ఏ మెమో రావడం నిష్ప్రయోజనమన్న అభిప్రాయం వ్యక్తమౌతున్నది.

సాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు

- పశ్చిమ డెల్టాలో కాల్వల పరిశీలనలో కలెక్టర్ నాగలక్ష్మి
- రూ.1 కోటితో వడ్లపూడి లిఫ్ట్ పనులు చేపడతామని హామీ
- రూ.5.7 కోట్లతో 76 పనులు..
- నెలలో 70 శాతం పూర్తికి ఆదేశాలు

దుగ్గిరాల, తాడేపల్లి టౌన్, జూలై 30: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున పొలాలకు సాగునీటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు చేపడతున్నామని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె కృష్ణా పశ్చిమ విభాగం హెడ్ రెగ్యులేటర్ నుంచి దుగ్గిరాల లాకుల వరకు సాగునీటి కాల్వలను పరిశీలించారు. మొదటగా కృష్ణ పశ్చిమ విభాగం హెడ్ రెగ్యులేటర్ పరిశీలించిన అనంతరం కాల్వ ప్రవాహ పరిమాణం, నీటి లభ్యత గురించి జనవరులను శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొండవీటి వాగు, అక్కడ ఉన్న ఎత్తిపోతల పథకం, పంపు హౌస్‌లను పరిశీలించారు. గుంటూరు చానెల్ లీడింగ్ చానెల్, 1.2 కి.మీ వద్ద గల హెడ్ రెగ్యులేటర్ పనితీరుని పరిశీలించారు. అనంతరం గుంటూరు ఛానెల్ 2.2 కిలోమీటర్ వద్ద గుర్రపుడెక్క తొలగించు పనులు తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. దుగ్గిరాల లాకులు సందర్శించి కొమ్మమూరు కాల్వ, ఈస్ట్, వెస్ట్ సైడ్ ఛానెల్స్, నిజాంపట్టణం కాల్వ, బ్యాంక్ కెనాల్ కాల్వలకు సంబంధించి నీటి ప్రవాహ పరిమణాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ పంట కాల్వల్లో అడ్డంకిగా ఉన్న గుర్రపుడెక్కను తొలగించేందుకు రూ.5.7 కోట్లతో 76 పనులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ పనులు 20 నుంచి 30 రోజులలోపు 70 శాతం వరకు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయ పనులు పూర్తి స్థాయిలో ప్రారంభమైనందున అవసరమైన మేరకు పంటలకు నీరందిస్తున్నామన్నారు. వడ్లపూడి వద్ద ఎత్తిపోతల పథకం పూర్తిచేస్తే మంగళగిరి, పెదకాకాని, దుగ్గిరాల, తెనాలి, పొన్నూరు మండలాల పరిధిలోని 26 వేల ఎకరాలకు నీరు అందించే అవకాశం ఉన్నందున, రూ.కోటితో పనులు పూర్తి చేస్తామన్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులతో మాట్లాడామన్నారు. ఈమని, పెదకొండూరు ఛానళ్లలో సమస్యలను స్థానిక టీడీపీ నాయకులు గూడూరు వెంకట్రావు, కాసరనేని కృష్ణ కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జనవరునుల శాఖ పర్యవేక్షక ఇంజనీరు ఉమామహేశ్వరరావు, కార్యనిర్వాహక ఇంజనీరు ఎన్.కె.వి.ప్రసాద్‌రావు, పశ్చిమ డెల్టా కార్యనిర్వహణ ఇంజనీరు ఎస్ మల్లికార్జున్, డ్రెయినేజ్ కార్య నిర్వాహక ఇంజనీరు పీ వెంకటరత్నం, ఉప కార్య నిర్వాహక ఇంజనీర్లు సీహెచ్ శివశంకర్, అనిల్, వి.కృష్ణ, తాడేపల్లి ఇన్‌చార్జి తహశీల్దార్ సతీష్, దుగ్గిరాల ఎంపీడీవో భవాని, తదితరులు పాల్గొన్నారు.



దుగ్గిరాల పాతలాకు వద్ద నీటి విడుదలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి



జాతీయ ర్యాంకులను చూపుతున్న ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు, అధికారులు

నాగార్జున విశ్వవిద్యాలయానికి జాతీయ ర్యాంక్

పెదకాకాని, జులై 30: ఇండియా టుడే-ఎండీఆర్‌ఏ బెస్ట్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ జనరల్ కేటగిరిలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జాతీయ స్థాయిలో 12వ ర్యాంకును, రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకును కైవసం చేసుకుందని వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కంచర్ల గంగాధరరావు తెలిపారు. మంగళవారం ఈ మేరకు ఆయన ర్యాంక్‌ల వివరాలను మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ రెప్యుటేషన్ అండ్ గవర్నెన్స్, అకడమిక్ అండ్ రీసెర్చ్ ఎక్సలెన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ లివింగ్ ఎక్స్‌పీరియన్స్, పర్సనాలిటీ అండ్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ అండ్ కెరీర్ ప్రోగ్రెషన్ అండ్ ప్లేస్‌మెంట్ ఆధారంగా ఇండియా టుడే - ఎండీఆర్‌ఏ ర్యాంకులను కేటాయించినట్లు ఇన్‌చార్జ్ వీసీ పేర్కొన్నారు. విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది కృషి వల్లే ఈ ర్యాంకు సాధ్యమైందన్నారు. ఇటువంటి ర్యాంకుల ద్వారా విశ్వవిద్యాలయ కీర్తి మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్. కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలం, సీడీసీ డీన్ ప్రొఫెసర్ వి.రవి కుమార్, ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఆర్‌వీఎస్‌ఎస్‌ఎన్ రవి కుమార్, సీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్. వి.వెంకటేశ్వర్లు ర్యాంకుల విభాగం కో ఆర్డినేటర్ డాక్టర్ పి.రవి తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్ల ఇన్‌-చార్జ్ డైరెక్టర్‌గా డాక్టర్ బ్రహ్మాజీరావు

పెదకాకాని, జులై 30: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డైరెక్టర్ రేట్ ఆఫ్ అడ్మిషన్స్ ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా డాక్టర్ పి.బ్రహ్మాజీరావు (పర్యావరణ శాస్త్రం) నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు నియామక ఉత్తర్వులను బ్రహ్మాజీరావుకు అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఇన్‌చార్జ్ వీసీ గంగాధరరావుకు, రెక్టార్ ప్రొఫెసర్ కె.రత్న షీలామణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలంలకు ధన్యవాదాలు తెలిపారు. విశ్వవిద్యాలయ ప్రవేశాలకు సంబంధించి అన్నిరకాల చర్యలు తీసుకుంటానని, శక్తివంచన లేకుండా కృషిచేసి వర్సిటీ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు.

యూజీ పరీక్షల ఇన్చార్జి కో ఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ కృష్ణారావు

పెదకాకాని, జూలై 30 ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డిగ్రీ (యూజీ) పరీక్షల ఇన్‌చార్జి కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ ఎన్వీ కృష్ణారావు (తెలుగు) నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఎన్వీ కృష్ణారావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన వీసీ గంగాధర్‌రావుకు, రెక్టార్, రిజిస్ట్రార్లకు ధన్యవాదాలు తెలియజేశారు. బుధవారం బాధ్యతలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ రెక్టార్ ప్రొఫెసర్ కె.రత్న షీలామణి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలంలు కృష్ణారావుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూలై 30: సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం మంగళవారం నాటికి 517.20 అడుగులు ఉంది. ఇది 144.21 టీఎంసీలకు సమానం. ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 800 క్యూసెక్కులు, కుడి కాలువ ద్వారా 5944 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 6744 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 1,55,716 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

విద్యుదాఘాతంతో టీడీపీ కార్యకర్త మృతి

మేడికొండూరు జూలై 30: మేడికొండూరు మండలం పేరేచర్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త పాములపాటి సాంబశివరావు(45) విద్యుదాఘాతానికి గురై మంగళవారం మృతి చెందాడు. ఇంట్లో మంచినీటి మోటారు దగ్గర పనిచేస్తుండగా విద్యుత్ షాక్ గురయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు సాంబశివరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



మృతుడు సాంబశివరావు

సూపర్ చైర్మన్‌కి చేదు అనుభవం

● వైసీపీఎమ్మెల్యే పీఏగా పనిచేసిన ఉద్యోగికి జడ్పీ షాక్.. ● నంద్యాల పంపేందుకు అనుమతి నిరాకరణ



గుంటూరు సిటీ, జూలై 30 : ఆయన జిల్లా పరిషత్(జడ్పీ) ఉద్యోగి. కాలం కలిసొచ్చి గత ప్రభుత్వంలో పల్నాడు వైసీపీ ఎమ్మెల్యే పీఏగా వెళ్లాడు. అంతే. జిల్లా పరిషత్‌ను తన అదుపు ఆజ్ఞల్లోకి తీసుకున్నాడు. ప్రజలు ఎన్నుకున్న చైర్మన్‌ను పక్కన పెట్టి, తానే సూపర్ చైర్మన్‌గా వ్యవహరించాడు. చివరకు మాతృ సంస్థలోని ఉన్నత అధికారులకు సైతం ఆదేశాలు జారీచేసి మరీ పనులు చేయించాడు. అంతటితో ఆగక జిల్లా పరిషత్‌లో ఉద్యోగం చేస్తున్న ఒక సామాజిక వర్గానికి తీరని ద్రోహం చేసాడు. వెంటాడి మరీ ఆ వర్గానికి చెందిన ఉద్యోగులను జిల్లా మారుమల ప్రాంతాలకు బదిలీ చేయించాడు. చివరకు విడో అన్న కనికరం కూడా లేకుండా మహిళా ఉద్యోగులను సుదూర ప్రాంతానికి బదిలీ చేయించాడు. ఒకానొక సందర్భంలో చివరకు జిల్లా పరిషత్‌లోని అతి ముఖ్యమైన వ్యక్తులను కూడా చెప్పింది చేయండి.. లేకపోతే ఇక్కడ ఉండరు ..అంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు . జిల్లా పరిషత్‌కు ఏ అధికారి బదిలీ పై రావాలన్నా సదరు ఉద్యోగి దయాదాక్షిణ్యాల మీదే ఆధారపడాల్సిన పరిస్థితిని కల్పించాడు. అటు నియోజకవర్గాల్లో అనేక రకాలైన వ్యవహారాల్లో తలదూర్చి అత్యంత వివాదాస్పదమైన విషయాలను చక్కబెట్టాడు. ఎమ్మెల్యే కంటే ముందే జోక్యం చేసుకొని తెలుగు దేశం పార్టీకి చెందిన అనేకమందిని ఇబ్బందులు పెట్టాడు. చివరకు తానే మినీ ఎమ్మెల్యేగా చలామణి అయ్యాడు. ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యింది. చేతిలో ఉన్న ఎమ్మెల్యే ఓడిపోయి కష్టాల పాలయ్యారు. పీఏగా వాళ్ళని వీళ్లని అదిరించిన పాపానికి రాజకీయ శత్రువులు ఎక్కువయ్యారు. చేసేది లేక.. ఇక్కడ ఉండలేక ఆ ఉద్యోగి నంద్యాల లో ఉన్న ఎమ్మెల్సీ పీఏగా వెళ్లేందుకు ముమ్మర ప్రయత్నాలు చేశాడు. చివరకు అక్కడి కలెక్టర్ కూడా అందుకు ఒప్పుకున్నారు. కానీ ఇక్కడి జిల్లా పరిషత్ అధికారులు మాత్రం సదరు ఉద్యోగిని రిలీవ్ చేసేందుకు నోమిరా అంటున్నారు. ఇక్కడే ఉండాల్సిందే.. వేసిన చోట ఉద్యోగం చేయాల్సిందే అంటున్నారు. ఇప్పుడు జడ్పీలో ఇదే హాట్ టాపిక్ అయ్యింది.

రైళ్ల భద్రతకు ఎస్‌పీఎం యాప్

క్రూ పనితీరుపై ఇక నుంచి సమగ్ర విశ్లేషణ ● స్వల్ప వ్యవధిలోనే సవివరంగా సమాచారం



గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రైళ్ల ఆపరేషన్స్‌లో విధులు నిర్వహించే క్రూ(సిబ్బంది) పనితీరుపై ఇక నుంచి సమగ్ర విశ్లేషణ జరగనుంది. ముఖ్యంగా భద్రత, సమయపాలన అంశాల్లో సంబంధిత ఉద్యోగుల పనితీరుని ఎస్‌పీఎం(స్పీడ్-మీటర్)యాప్ ద్వారా కొలమానం చేయనున్నారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ సొంతంగా ఈ యాప్ ని తయారు చేసి అమలులోకి తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా రైళ్ల వేగం, బ్రేకింగ్ దూరం, సిగ్నల్ నిబద్ధత వంటివి కూడా పరిశీలించనున్నారు. అలానే పనితీరు మూల్యాంకన ప్రక్రియలో దృశ్య, కంప్యూటర్ నివేదికలు ఈ యాప్ అందించే సమాచారం ఎంతగానో ఉపయోగపడనుంది. స్వల్ప వ్యవధిలో సమగ్ర విశ్లేషణ చేయగలిగే మంచి పరికరంగా ఈ ఎస్‌పీఎం యాప్ మారుతుందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇటీవలకాలంలో తరచుగా రైళ్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా ప్రమాదాల్లో సిబ్బంది నిర్లక్ష్యం ప్రస్ఫుటమవుతున్నది. చాలా సం దర్భాల్లో అనుమతికి మించి లోకో పైలట్లు వివిధ సెక్షన్లలో రైళ్లను వేగం తో నడుపుతున్నారు. అలానే సిగ్నల్ జంపింగ్ అయిన సంఘటనలు కూడా నమోదు అవుతున్నాయి. ఇంకోవైపు పీ-వే సిబ్బంది, స్టేషన్ మాస్టర్లు మాన్యువల్స్‌ని సక్రమంగా పాటించడం లేదు. ఈ విషయంలో వీరితో పాటు పైలట్లు, లోకోపైలట్లకు తరచుగా కౌన్సెలింగ్ చేయాలని హెడ్‌క్వార్టర్స్ నుంచి ఆదేశాలు జారీ అవుతున్నాయి. అయినప్పటికీ ప్రమాదాలకు అడ్డుకట్ట పడటం లేదు. ఇటీవల ఒక స్పెషల్ ట్రైన్ విష యంలో గుంటూరు డివిజన్ పరిధిలో సాంకేతిక సమస్య ఉత్పన్నమై ఆ రోజున ఒక్కో రైలు నాలుగు గంటల ఆలస్యంగా నడపాల్సిన పరిస్థితి తలెత్తింది. అలానే గత ఏడాది ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో రెండు బోగీల్లో అగ్నిప్రమాదం చోటు చేసుకొన్నది. మరో సంఘటనలో విష్ణుపురం వద్ద గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ప్రాణనష్టం జరగకపోయినా రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం వాటిల్లింది. ఈ నేపథ్యంలో రైల్వే శాఖ భద్రత, సమయపాలన విషయంలో కట్టుదిట్టంగా ఉండాలని నిర్ణయించింది. అందులో భాగంగానే ఈ ఎస్‌పీఎం యాప్‌ని తాజాగా తీసుకొచ్చింది. ఈ యాప్ భద్రతతో పాటు లోకోకు సంబంధించిన వేగం, మొబిలిటీ వంటి అంశాల్లోనూ ఎంతగానో ఉపయోగపడుతుందని ఉన్నతాధికారులు తెలిపారు. రెండు రోజుల క్రితం ఈ యాప్ గురించి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డీఆర్‌ఎం ఎం రామకృష్ణకు వివరించారు. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా ఎస్‌పీఎం యాప్‌ని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు.

అమ్మనాన్నలను మరిపించేలా మాచర్లను అభివృద్ధి చేస్తా

● చట్టపరంగా దోషులకు శిక్ష తప్పదు... ● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల,జూలై 30 : ఎమ్మెల్యేలుగా వ్యవహరించిన నా తల్లిదండ్రులైన నాగిరెడ్డి,దుర్గాంబలను మరిపించేలా మాచర్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. మంగళవారం రెంటచింతలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ళ నుంచి అభివృద్ధి మసకబారి అరాచకం,దౌర్జన్యం,భూములు లాక్కోవడం,అక్రమ కేసులు బనాయించి స్టేషన్లలో హింసించడం లాంటి ఘటనలకు పాల్పడిన వ్యక్తులు చట్టపరంగా శిక్షను అనుభవించాల్సిందేనని స్పష్టం చేశారు. ఎల్లకాలం అధికారంలో వుండి ప్రతిపక్ష నేతలను హింసిద్దామని భ్రమించారని అందుకోసమే విజ్ఞులైన ఓటర్లు గట్టి గుణపాఠం చెప్పి 11 సీట్లకు పరిమితం చేసి ప్రతిపక్ష హోదాలేకుండా చేశారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా సదరు నేతల ప్రవర్తనలో మార్పు రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు.సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి తీరతామని,ఇంటింటికి కుళాయి కనెక్షన్,నిరుపేదలకు నివేశనా స్థలాలతో పాటు గృహాలు నిర్మించి ఇస్తామని పేర్కొన్నారు.డిసెంబర్ మొదటి వారం కల్లా జాతీయ రహదారి పనులు పూర్తవుతాయని చెప్పారు.బుగ్గవాగు రిజర్వాయర్ ఆధునీకరణ, సత్రశాల ఆలయం అభివృద్ధిపై పూర్తి స్థాయిలో దృష్టి పెడతానన్నారు. పార్టీలో గ్రూపుల గోలొద్దని మనందరం ఒకటే అనే భావంతో వ్యవహరిద్దామని చురకలు వేశారు.ఈ విలేకరుల సమావేశంలో టీడీపీ మండల అధ్యక్ష,ఉపాధ్యక్షులు అబ్బిరెడ్డి,శ్రీనివాసరావు,టౌన్ అధ్యక్షులు రాజారెడ్డి మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు సుమంత్‌రెడ్డి,రాయపరెడ్డి,రామకృష్ణ,దానయ్య, కృష్ణారెడ్డి,నాళం పెదబాబు,మర్రి రాజ్‌కుమార్,సామ్యేల్, ప్రభురాజ్,మౌలాలి,అప్పయ్య,సిద్దయ్య,మల్లయ్య పాల్గొన్నారు.


సొంతింటి కల నెరవేర్చాలన్నదే ప్రభుత్వ ధ్యేయం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జూలై 30 : ఇల్లులేని ప్రతి పేదవాడికి సొంత ఇంటి కల నెరవేర్చాలన్నదే కూటమి ప్రభుత్వం ధ్యేయం అని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ. జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చేనాటికి అన్ని శాఖలలో అప్పులు తప్ప ఆదాయ మార్గం కనిపించలేదన్నారు. అధికారం చేపట్టిన వెంటనే ఐదు కీలకమైన హామీలపై సంతకంచేసి ఒకొక్కటిగా నెరవేర్చుకుంటూ రైతులకు, యువతకు, 60లక్షల మంది అవ్వా తాతలకు, ఉద్యోగులకు లబ్ధి చేకూరే విధంగా అడుగులు ముందుకు వేస్తున్నారన్నారు. ఇలా ఒకొక్కటిగా హామీలు నెరవేర్చుకుంటూ పోతున్న ఎన్డీఏ ప్రభుత్వం మరొక కీలకమైన అందరికీ ఇల్లు అనే నిర్ణయం తీసుకుందన్నారు. ఇళ్ల నిర్మాణంలో పేదలు ఇబ్బంది పడకూడదనే చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. పీఎంఏవై కింద వంద రోజులలో పెండింగ్‌లో ఉన్న లక్ష 25 వేల ఇళ్లను, సంవత్సర కాలంలో 8,25,000 ఇళ్ళను పూర్తిచేసి పేదలకు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు పోతుందని వెల్లడించారు.

వ్యాపార అభివృద్ధికి యూనియన్ బ్యాంక్ అండ

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్



ఖాతాదారులకు పత్రాలను అందజేస్తున్న ఆలపాటి, బ్యాంక్ రీజినల్ హెడ్ జవహర్, ఏజీ జితేందర్

గుంటూరు సిటీ, జూలై 30: చిన్న, మధ్యతరగతి పారిశ్రామికవేత్తల వ్యాపార అభివృద్ధికి యూనియన్ బ్యాంకు వెన్ను దన్నుగా నిలుస్తుందని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. గుంటూరులోని యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం జరిగిన మైక్రో స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ డెవలప్మెంట్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. బ్యాంక్ రీజనల్ హెడ్ ఎస్‌ఎస్ జవహర్ మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈ ఎంపవర్ స్కీం కింద రూ.కోటి నుంచి రూ.50 కోట్ల వరకు రుణం ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఖాతాదారులకు తక్షణ ఋణ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ముఖ్య కార్యాలయ ఏజీఎం జితేందర్, డిప్యూటీ రీజినల్ హెడ్ అశ్వర్థనాయక్, రాజేష్, ఎంఎల్‌పీ ఏజీఎం హరేరామ్‌షా తదితరులు పాల్గొన్నారు.

సిటీ శాఖలో పునర్విభజన అస్తవ్యస్తం

రీజనల్ కార్యాలయాలతో సర్కిల్స్ నిర్వీర్యం

గుంటూరు, జూలై 30: గత వైసీపీ ప్రభుత్వ పెద్దల అనాలోచిత విధానాల కారణంగా వాణిజ్యపన్నులశాఖలో సర్కిల్స్ కార్యాలయాల పనితీరు నిర్వీర్యమైంది. శాఖలో కీలకంగా ఉన్న సర్కిల్ కార్యాలయాల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. సర్కిల్స్ పుర్విభజన ప్రక్రియ అభాసుపాలైంది. రాష్ట్ర వ్యాప్తంగా గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన సర్కిల్స్ పునర్విభజన ప్రక్రియను పునఃపరిశీలించి లోపాలను సరిదిద్దాలని ది సిటీ ఎన్‌జీవో అసోసియేషన్ నాయకులు కోరుతున్నారు. చిలకలూరిపేట, మాచర్ల, అద్దంకి, వినుకొండ లాంటి పట్టణాల్లో సర్కిల్ కార్యాలయాలు ఎత్తి వేశారు. తద్వారా అక్రమ వ్యాపారాలపై నిఘా కొరవడిందని ఆ శాఖ సిబ్బందే చెబుతున్నారు. కొందరి వైసీపీ నేతల అక్రమ వ్యాపారాలకు అడ్డులేకుండా ఉండేందుకు కొందరు పెద్దలు సర్కిల్ కార్యాలయాలను సైతం ఎత్తివేశారన్న ఆరోపణలున్నాయి. ఆర్థికశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పయ్యావుల కేశవ్‌ను ఇటీవల ది సిటీ అసోసియేషన్ గుంటూరు-2 డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ జానీబాషా కార్యవర్గం నాయకులు కలిసి సర్కిల్స్ పునర్విభజన లోపాలను సరిదిద్దాలని కోరారు. అలానే నిబంధనలకు విరుద్ధంగా రీజనల్ కార్యాలయాల పేరుతో ఉద్యోగుల బదిలీల ప్రక్రియపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు మంత్రికి వినపత్రం అందజేశారు.

బదిలీలు.. పోస్టుల రద్దు

గతంలో ఎన్నడూ లేని విధంగా తిరుపతి, విజయవాడ, వైజాగ్‌లలో ఏర్పాటు చేసిన రీజనల్ కార్యాలయాల్లో విధులకు డివిజనల్, సర్కిల్స్ కార్యాలయాల నుంచి ఉద్యోగులను బదిలీ చేశారు. బదిలీల్లో కూడా నిబంధనలు పాటించలేదని ఉద్యోగ సంఘాల నాయకులు ఆక్షేపిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1157 పోస్టులు రద్దు చేశారు. తద్వారా సర్కిల్స్, డివిజనల్ కార్యాలయాల్లో సిబ్బంది కొరతతో పనులు కుంటుపడిపోయాయి. మరోవైపు గజిటెడ్ హోదా కలిగిన గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ అధికారులకు సరైన బాధ్యతలు కేటాయించక పోవడంతో ఆ క్యాడర్ నుంచి తగిన ఫలితాలు రాబట్టడంలో వెనుకబడుతున్నారన్న విమర్శలున్నాయి. వారికి కనీసం జాబ్ చార్ట్ కూడా ఇవ్వలేదన్న విమర్శలు ఉన్నాయి.

మిర్చి కొనుగోళ్లు పెంచేందుకు చర్యలు

జీఎంసీ సెక్రెటరీ వెంకటేశ్వరరెడ్డి ● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో కొనుగోళ్లు పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో శీతల గిడ్డంగుల్లో రంగు మారుతున్న మిర్చి అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. మార్కెట్‌యార్డుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలోని కొన్ని ప్రాంతాల నుంచి రైతులు మిర్చిని తీసుకొచ్చి విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. కొంతమంది రైతులు మిర్చి ధర రాబోయే రోజుల్లో పెరుగుతుందన్న తలంపుతో శీతలగిడ్డంగుల్లో నిల్వ చేస్తున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది మిర్చి రేటు రకం, నాణ్యతని బట్టి క్వింటాల్‌కి సుమారు రూ. 3 వేల నుంచి రూ. 7 వేల వరకు తగ్గిందన్నారు. రైతులు మిర్చి అధిక దిగుబడి కోసం రసాయన ఎరువులను మోతాదుకు మించి వినియోగించి ఉన్నారు. దీని వలన శీతల గిడ్డంగిలో ఏడాది కి పైగా నిల్వ చేసిన మిర్చి రంగు మారడంతో పాటు ఫంగస్ చేరుతున్నదన్నారు. ప్రస్తుతం యార్డులో రోజుకు 45 వేల టిక్కీల విక్రయం జరుగుతున్నది. దీని దృష్ట్యా రైతులు మార్కెట్‌లో ధరల హెచ్చు తగ్గులను గమనిస్తూ గిట్టుబాటు ధరకు మిర్చిని విక్రయించుకొనేదుకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00



వైద్య పరికరాలు అందజేస్తున్న ఎన్నారై డాక్టర్ రవికుమార్

జింకానా వైద్యుల సేవలు అభినందనీయం

గుంటూరు (మెడికల్) జూలై 30: ప్రభుత్వ సమగ్రాస్పత్రి అభివృద్ధికి జింకానా చేస్తున్న సేవలు అభినందనీయమని సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం శుశ్రుతహాల్‌లో జరిగిన కార్యక్రమంలో గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, ఉత్తర అమెరికా (జింకానా) మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికుమార్ త్రిపురనేని రూ.15 లక్షల విలువైన ఎనస్థీషియా వైద్య పరికరాలను ప్రభుత్వాస్పత్రికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జింకానా దాతృత్వంతో ప్రభుత్వ సమగ్రాస్పత్రి ఆవరణలో రూ.100 కోట్ల భారీ వ్యయంతో ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణ పనులు సాగుతున్నట్లు తెలిపారు. డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలో పేదలకు కూడా కార్పొరేట్ వైద్యసేవలు అందాలనే ఉద్దేశంతో నిరంతరం తమ వంతు సహయ, సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ హరికృష్ణ, మత్తు మందు వైద్య విభాగాధిపతి డాక్టర్ పోలయ్య, జింకానా కోఆర్డినేటర్ డాక్టర్ పీవీ హనుమంతరావు పాల్గొన్నారు.

పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్

గుంటూరు (మెడికల్) జూలై 30: గుంటూరు వైద్య కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో పలు పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జీఎంసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టీటీకే రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లమో ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, ఎనస్థీషియా టెక్నీషియన్, మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్, రెస్పిరేటరీ థెరపీ టెక్నీషియన్, పర్ఫ్యూషన్ టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్, కార్డియాలజీ టెక్నీషియన్, ఆప్తాల్మిక్ అసిస్టెంట్, రేడియోగ్రాఫిక్ అసిస్టెంట్, డార్క్ రూమ్ అసిస్టెంట్ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు ఆయన వివరించారు. రెండేళ్ల కాల పరిమితి గల ఈ డిప్లమో కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు సమర్పించేందుకు ఆగస్టు ఆరు ఆఖరు తేదీ అని, ఆగస్టు 19న కౌన్సెలింగ్ జరుగుతుందని ప్రొఫెసర్ టీటీకే రెడ్డి వెల్లడించారు.

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్‌లు

క్రోసూరు, జూలై 30 : పల్నాడు జిల్లా క్రోసూరు మండల పరిధిలోని విప్పర్ల గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ డిప్లమో కోర్సుల్లో మిగిలి ఉన్న సీట్లను బుధవారం స్పాట్ అడ్మిషన్ విధానంలో భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపల్ రమాదేవి మంగళవారం తెలియ జేశారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులందరూ స్పాట్ అడ్మిషన్‌లకు అర్హులన్నారు. అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతో బుధవారం వ్యక్తి గతంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్దకు హాజరు కావాలని తెలిపారు. ప్రవేశం పొందిన అభ్యర్థులు పూర్తి ఫీజు రూ 4700, కౌన్సిలింగ్ ఫీజు రూ 1100 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కౌన్సిలింగ్ ఫీజు రూ 350 చెల్లిస్తే పోతుందన్నారు. స్పాట్ అడ్మిషన్‌ల ద్వారా ప్రవేశం పొందిన అభ్యర్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదన్నారు. పూర్తి వివరాల కోసం 9440613229 నెంబరులో సంప్రదించాలన్నారు.

నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ

క్రోసూరు, జూలై 30: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన సంస్థ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు ప్రభుత్వం ద్వారా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కోటప్పకొండలోని ట్రైనింగ్ సెంటర్ జాబ్స్ కో-ఆర్డినేటర్ మంగళవారం తెలియ జేశారు. శిక్షణా కాలం నాలుగు నెలలు ఉంటుందని, కామన్ సబ్జక్టులుగా కంప్యూటర్ కోర్సు, కంప్యూటర్ టైపింగ్, స్పోకెన్ ఇంగ్లీషు, జాబ్స్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్ నేర్పుతామన్నారు. విద్యార్హత ఏదైనా డిగ్రీ పాసై 18 నుంచి 30 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు ప్రైవేట్ మల్టీ జ్యువెలర్స్ షోరూంలలో, కస్టమర్ సేల్స్ అసోసియేట్ , సేల్స్ సూపర్ వైజర్, కంప్యూటర్ ఆపరేటర్, టీమ్ లీడర్, బిల్లు ఆపరేటర్, టాలీ ఎకౌంటెంట్ ఆపరేటర్ మొదలైన ఖాళీల్లో అవకాశాలు కల్పిస్తామన్నారు. జీతం రూ 15వేలు నుంచి రూ 25వేలు వరకు ఉంటుందని, నిబంధనల ప్రకారం పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం ఉంటుందని, ఉద్యోగంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అభ్యర్థులకు మాత్రమే ఇక్కడ శిక్షణకు అవకాశం ఉందన్నారు. నరసరావుపేట మండలం కోటప్పకొండ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ ఇస్తామన్నారు. పూర్తి వివరాలకు 9010585360 నెంబరులో సంప్రదించాలన్నారు.

బాంబు కేసులో నిందితులు అరెస్టు

దుర్గి, జూలై 30: పల్నాడు జిల్లా దురిగ మండలం జంగమహేశ్వరపాడులో మే 24వ తేదీన టీడీపీ సానుభూతిపరుడు గుమ్మా నాగరాజు ఇంట్లో నాటుబాంబులు, మరణాయుధాలు ఉండడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఈనెల 17వ తేదీన మండలంలోని కాకిరాలకు చెందిన బొజ్జా నాగేంద్రబాబును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదే కేసులో తాజాగా మంగళవారం కాకిరాలకు చెందిన బాణావత్ శ్రీనునాయక్ అలియాస్ లడ్డు శ్రీనును కూడా అదుపులోకి తీసుకున్నారు. సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ మే 7వ తేదీన జంగమహేశ్వరపాడు శివారులో నాటుబాంబులు, మారణాయుధాలను దాచి అక్కడినుంచి గుమ్మా నాగరాజు గృహానికి చేర్చారన్నారు. సమాచారం తెలుసుకున్న అప్పటి సీఐ చినమల్లయ్య నాటుబాంబులు, మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈనెల 7వ తేదీన పొలంలో నాటుబాంబు పేలడంతో అక్కడకు చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారన్నారు. గతంలో గుమ్మా నాగరాజు గృహంలోకి నాటుబాంబులు తరలిస్తున్న సమయంలో ఒక నాటుబాంబు మిగిలిపోయిందని, ఆ బాంబు ఈనెల 7వ తేదీన పొలంలో పేలిందని సీఐ శ్రీనివాసరావు వివరించారు.

టీఎన్‌టీయూసీకి అనుబంధంగా ఏపీసీబీఈఏ

మంగళగిరి, జూలై 30: ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జూన్ 6న గుంటూరులో జరిగిన సమావేశంలో టీఎన్‌టీయూసీకి అనుబంధంగా ఏర్పడినట్లు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనేరు బాలాజీ ప్రసాద్ తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం మంగళగిరి బ్రాంచి కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార బ్యాంకుల ఉద్యోగులు ఇకపై టీఎన్‌టీయూసీకి అనుబంధంగా పనిచేస్తున్న ఏపీసీబీఈఏకు మద్దతుగా ఉంటారన్నారు. రాష్ట్ర కార్యదర్శులు డి.శ్రీనివాస్, జీ.శ్రీనివాస్ మాట్లాడుతూ నెల్లూరు డీసీసీబీలో ఇటీవల వైఎస్‌ఆర్‌టీయూసీకి అనుబంధంగా ఉన్న కొంతమంది యూనియన్ బైలాకు వ్యతిరేకంగా సెంట్రల్ కమిటీ సమావేశం నిర్వహించి ఒకరిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కోఆప్ట్ చేస్తున్నట్లు ప్రకటించారని, ఇది ట్రేడ్ యూనియన్ బైలాకు పూర్తి విరుద్ధమన్నారు. రాష్ట్ర జనరల్ బాడీలో ఎన్నికైన ప్రధాన కార్యదర్శి రాజీనామా చేయకుండా వేరొకరిని కోఆప్ట్ చేయడం చెల్లదన్నారు. వైఎస్‌ఆర్ టీయూసీకి చెందిన కొంత మంది నాయకులు కార్మిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు సహకార శాఖా మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లనున్నామని చెప్పారు. వైఎస్‌ఆర్‌టీయూసీ యూనియన్ నేతల ను ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కానీ, వేతన సవరణ చర్చలకు కానీ ఆహ్వానించవద్దని ఆప్కాబ్ ఎండీ శ్రీనాథ్‌రెడ్డికి విన్నవించినట్టు తెలిపారు. వైఎస్‌ఆర్‌టీయూసీకి అనుబంధంగా ఉన్న కొంత మంది నేతలను అసోసియేషన్ నుంచి బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు.

45,472 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 47,204 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 45,472 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 17,480 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	15500
నెంబరు. 5	10000	14000
273	9500	12500
341	8500	16500
4884	10000	10000
సూపర్ 10	15000	15000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	18500
బ్యాడిగి	9000	14500
దేవనూరుడీలక్స్	8500	12500
తెల్లకాయలు	4500	12000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	10000	15000
నెంబరు. 5	12000	12000
273	11300	14000
341	9500	14500
4884	11500	16000
సూపర్ 10	–	–
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10300	18400
బ్యాడిగి	9000	12800
దేవనూరుడీలక్స్	9000	15000
తెల్లకాయలు	5000	11000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

రాజముద్రతో పాస్ పుస్తకాల పంపిణీ హర్షణీయం

● టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్


డేగల ప్రభాకర్

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాజముద్రతో భూ యజమానులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ అన్నారు. పార్టీ నగర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి పట్టాదారు పాసుపుస్తకంపై రాజముద్ర వేసి ఇస్తామని చెప్పిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా జగన్‌రెడ్డి పట్టాదారు పాసు పుస్తకాలపై తన బొమ్మను ముద్రించుకున్నారని, అది జగన్‌రెడ్డి ప్రచార పిచ్చికి పరాకాష్ట అని డేగల ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకోసం రూ.15 కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారన్నారు. పొలాల సరిహద్దు రాళ్లపై తన బొమ్మను ముద్రించి జగన్‌రెడ్డి రూ.700 కోట్లు ప్రజాధనం వృథా చేశారన్నారు. ఈ నిధులు సరిగ్గా వినియోగించుకొని ఉంటే రాష్ట్రంలో ఏదో ఒక ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చి ఉండేదన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలివ్వాలని నిర్ణయించడంతో నీడ లేని పేదలకు సొంతింటి కల నెరవేరుతుందన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ 2029 కల్లా శాశ్వత గృహ వసతి కల్పించాలని, రానున్న వంద రోజుల్లో 1.25 లక్షల గృహాలు, ఏడాదిలో 8.25 లక్షల ఇళ్ల నిర్మాణాలు కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తుందన్నారు.

సమాజ హితమే లక్ష్యంగా వ్యాపారాభివృద్ధికి పాటుపడాలి

గుంటూరు(విద్య), జూలై 30 : సమాజ హితమే లక్ష్యంగా విద్యార్థి ఆలోచనలు పెట్టుబడిగా పెట్టి వ్యాపారం చేయాలని ఎంఎక్స్ ఏవియేషన్ సొల్యూషన్స్ వ్యవస్థాపకులు, ఆర్వీఆర్ అండ్ జేసీ పూర్వ విద్యార్థి దినకర లక్ష్మణ నాగళ్ళ అన్నారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో టర్నింగ్ ఐడియాస్ ఇన్ టూ ఇన్వెస్ట్‌మెంట్స్ అనే అంశంపై మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. వినూత్న ఆలోచనలతో ప్రజాఉపయోగకరమైన స్టార్టప్‌లు ఎప్పటికి నిలిచి ఉంటాయని తెలిపారు. ఆర్థిక పురోగతి ఇటువంటి స్టార్టప్‌ల ద్వారానే సాధ్యమని అన్నారు. స్విగ్గి, జొమాటో, ఓలా, రాపిడో, అమెజాన్ వంటివి ఇలా ఏర్పడినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, ఆర్అండ్‌డి డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ శ్రీనివాసరావు, డాక్టర్ స్వర్ణలత, ఐటీబీఐ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖర్, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ డీవీవీ కృష్ణప్రసాద్, ఐటీబీఐ సీఈవో మహేంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.


దినకర లక్ష్మణ నాగళ్ళకు జ్ఞాపిక అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు

ఆర్వీఆర్‌జేసీలో నూరుశాతం ఇంజనీరింగ్ సీట్లు భర్తీ

గుంటూరు(విద్య), జూలై 30 : ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఏపీ ఈఏపీసెట్ నిర్వహించిన తుది విడత కన్వీనర్ కోటా సీట్ల భర్తీలోనూ చౌడవరంలోని ఆర్వీఆర్అండ్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో నూరుశాతం సీట్లు భర్తీ అయ్యాయని కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు జె.మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె మద్దినేని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్వీఆర్అండ్‌జేసీలో కన్వీనర్ కోటా కింద మొత్తం 1296 సీట్లు ఉన్నాయని, తుది విడత కౌన్సెలింగ్‌లోనూ మొత్తం సీట్లు భర్తీ అయినట్లు తెలిపారు. గత ఏడాదికంటే ఈ ఏడాది మెరుగైన ర్యాంకులతో అన్ని బ్రాంచీల సీట్లు భర్తీ అయ్యాయని వెల్లడించారు. కంప్యూటర్ కోర్సుకు ఉన్న డిమాండ్‌తోపాటు సంప్రదాయ కోర్సులైన సివిల్, మెకానికల్, కెమికల్, ఎలక్ట్రికల్ బ్రాంచీల్లో సీట్లు భర్తీ అయ్యాయని ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్అండ్‌డి డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ శ్రీనివాసరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పథకాలకు మహనీయుల పేర్లు పెట్టడం అభినందనీయం

● ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ప్రధాన కార్యదర్శి సతీష్ శర్మ

గుంటూరు, జూలై 30 : రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు మహనీయుల పేర్లు పెట్టటం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనూరు సతీష్‌శర్మ ప్రశంసించారు. ఇన్నర్ రింగ్ రోడ్డులోని సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలకు మహనీయుల పేర్లు పెట్టి వారు చేసిన సేవలను నేటి సమాజానికి తెలియజేసే విధంగా చేయడం స్ఫూర్తివంతంగా ఉందన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, డొక్కా సీతమ్మ, ఏపీజీ అబ్దుల్ కలాంల సేవలు చరిత్ర ఉన్నంత కాలం ప్రజల హృదయాలలో నిలిచిపోతాయన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, ఐటీ కమ్యూనికేషన్స్ మంత్రి నారా లోకేశ్‌లకు సంఘం తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. మాజీ సీఎం జగన్ ప్రజల డబ్బుతో పథకాలకు తన పేర్లు పెట్టుకుని సొంతడబ్బా కొట్టుకొన్నారని ఎద్దేవా చేశారు. విలేకరుల సమావేశంలో రాజశేఖర్, మహిళా నేత కరి నాగలక్ష్మి, మాటేటి నాగరాజు తదితరులున్నారు.

సూర్యనారాయణతోనే ఉద్యోగుల హక్కుల పరిరక్షణ

● జలవనరుల శాఖ రాష్ట్ర ఉద్యోగుల సర్వీసెస్ అధ్యక్షుడు చల్లా


చల్లా వెంకటేశ్వరరెడ్డి

గుంటూరు(తూర్పు), జూలై 30 : ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణతోనే ఉద్యోగుల హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుందని ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జలవనరుల శాఖ రాష్ట్ర ఉద్యోగుల సర్వీసెస్ అధ్యక్షుడు చల్లా వెంకటేశ్వరరెడ్డి అన్నారు. కలెక్టరేట్ ఎదుట ఇరిగేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన జీపీఎఫ్, సీపీఎస్ రద్దు, ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలనే అనేక సమస్యలపై సూర్యనారాయణ పోరాటాలు చేసారని గుర్తు చేశారు. ఆయన నాయకత్వాన్ని నమ్మి అనేక మంది ఉద్యోగులు క్రియాశీల సభ్యత్వం తీసుకుంటున్నారని అన్నారు. 26 జిల్లాల్లో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఉన్న ఏకైక అసోసియేషన్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘమని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నుంచి బహిష్కరణ గురైన వారు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులని శ్రీకాంత్‌రాజు, ఆస్కారరావు చెప్పుకోవటం హాస్యాస్పదమని అన్నారు. వీరిని బహిష్కరణ చేస్తూ సంఘ 78 మంది సభ్యుల తీర్మానం కూడా చేయడం జరిగిందన్నారు. దీనికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు మద్దతు పలికి తొలగిస్తూ తీర్మానం చేసి సంతకాలు పెట్టడం కూడా జరిగిందన్నారు. కేఆర్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పని చేస్తుందని, ఎటువంటి అసత్య ప్రచారాలు నమ్మవద్దని కోరారు.

పింఛన్ల పంపిణీకి పకడ్బందీ ప్రణాళిక

● సీఎస్‌కు నివేదించిన కలెక్టర్

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు నెలలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లని సక్రమంగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్‌కు తెలిపారు. రాష్ట్ర సచివాలయం నుంచి సీఎస్ మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ నాగలక్ష్మి తన కార్యాలయం నుంచి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఆగస్టు 1వ తేదీన ఉదయం 6 గంటలకే ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడంతో పాటు అదే రోజున 96 శాతం పైగా పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది 1వ తేదీన ఇంటింటికి వెళ్లి 96 శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేయాలని, 2వ తేదీన నూరు శాతం పంపిణీని పూర్తి చేయాలని ఆదేశించారు. ఫింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్లు స్వయంగా పాల్గొనాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ తెలిపారు.

కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో 2,60,192 మంది పెన్షనర్లు వున్నారని, వారికి రూ.110.69 కోట్లు విడుదల అయ్యాయన్నారు. ఆగస్టు 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇందుకు 4840 మంది అధికారులను నియమించామని, వారిలో 4303 మంది సచివాలయ సిబ్బంది, 537 మంది ఇతర ప్రభుత్వ ఉద్యోగులు వున్నారన్నారు. తొలి రోజే 99 శాతం పెన్షన్ల పంపిణీ చేయడానికి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం జరిగిందని, మిగిలిన వారికి ఆగస్టు 2న పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పెన్షన్ల పంపిణీకి సంబంధించి ఈ నెల 31వ తేదీనే మైక్ సెట్, టాంటాం, ఆడియో సందేశం, పత్రికా ప్రకటనల ద్వారా విస్తృత ప్రచారం కల్పించడం జరుగుతుందన్నారు. 31న రూట్ మ్యాప్ సిద్ధం చేసుకొని పెన్షన్ల పంపిణీకి పగడ్బందీగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, బయోమెట్రిక్ పరికరాలు పెన్షన్ల పంపిణీ అధికారులకు చెక్ చేసి ఇవ్వాలని ఆదేశించామన్నారు. పింఛన్ల పంపిణీ అనంతరం వేలిముద్రలు, సంతకం తీసుకోవడం జరుగుతుందని, డీడీవోలు నగదు డ్రా చేసి పీడీఓలకు అందజేయాలని ఆదేశించామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.


సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ నిర్వహించిన వీసీకి హాజరైన కలెక్టర్ నాగలక్ష్మి

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి ప్రణాళిక సిద్ధం

● ఇన్‌చార్జి కమిషనర్ శ్యాంసుందర్

గుంటూరు(కార్పొరేషన్), జూలై 30 : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 58,971 మంది పెన్షనర్లకు ఆగస్టు ఒకటవ తేదినే నూరు శాతం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేయడానికి తగిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ ఎం.శ్యాం సుందర్, అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కమిషనర్, అదనపు కమిషనర్లు మాట్లాడుతూ నగరంలోని 206 వార్డు సచివాలయాల పరిధిలోని వివిధ కేటగిరిలకు సంబంధించి 58,971 మంది పెన్షనర్లకు రూ.25,09,96,500లను వారి ఇంటి వద్దనే 1632 మంది వార్డు సచివాలయ కార్యదర్శుల ద్వారా అందించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. పెన్షన్‌ల పంపిణీ సజావుగా జరిగేలా పర్యవేక్షణకు 42 మంది నోడల్ అధికారులను నియమించామని తెలిపారు. పెన్షన్ల పంపిణీ విధులు కేటాయించిన కార్యదర్శులు ఆగస్టు 1వ తేదీకి ముందే తమకు కేటాయించిన ప్రాంతం, పెన్షనర్ల సంఖ్య(కేటగిరి వారీగా), పంపిణీ చేయాల్సిన నగదు తదితర అంశాలను నోడల్ అధికారి ద్వారా తెలుసుకోవాలని ఆదేశించామన్నారు. పెన్షన్ పంపిణీ ఉదయం 6 గంటల నుండే ప్రారంభించాలని, ప్రతి గంటకు పంపిణీ చేసిన శాతం జీఎంసీకి తెలియచేయాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

స్టెంట్ అసిస్టెడ్ కాయిలింగ్ టెక్నిక్‌తో...
రోగి ప్రాణాలు కాపాడిన శ్రేష్ట హాస్పిటల్స్

గుంటూరు (మెడికల్) జూలై 30 : మెదడులో రక్తనాళాలు ఉబ్బి (ఎన్యురిజమ్) పగిలి రక్తస్రావంతో ప్రాణాపాయ స్థితిలో వచ్చిన రోగికి శ్రేష్ట హాస్పిటల్స్‌లో వినూత్నమైన 'స్టెంట్ అసిస్టెడ్ కాయిల్ ఎంబలైజేషన్' అనే అధునాతన ప్రక్రియతో వైద్య చికిత్సలు అందించి ప్రాణాలు సంరక్షించారు. గుజ్జనగుండ్ల సెంటర్‌లోని శ్రేష్ట హాస్పిటల్స్‌లో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నాగార్జున గొట్టిపాటి మంగళవారం ఈ కేసు వివరాలను తెలిపారు. ఇటీవల బ్రెయిన్ ఎన్యురిజమ్‌తో బాధపడుతున్న 58 ఏళ్ల మహిళ రోగి, రక్తనాళం ఉబ్బి పగిలి మెదడులో రక్తస్రావం కావడంతో తీవ్రమైన తలనొప్పితో ప్రాణాపాయ స్థితిలో తమ వైద్యశాలకు వచ్చినట్లు తెలిపారు. స్కానింగ్ పరీక్షల్లో ఈ ఎన్యురిజమ్ 8 మిల్లీమీటర్ల పరిమాణంలో ఉన్నట్లు గుర్తించామన్నారు. వెంటనే తమ ఆసుపత్రికి చెందిన న్యూరో వాస్క్యులర్ వైద్యనిపుణులు స్పందించి అత్యవసర చికిత్సలు అందించినట్లు చెప్పారు. ఈ క్రమంలో ఫిమరల్ పంక్చర్ ద్వారా సన్నటి స్టెంట్‌లు, కాయిల్స్ మెదడుకు పంపి, అసిస్టెడ్ కాయిలింగ్ టెక్నిక్‌తో పగిలిన రక్తనాళంను సరి చేసి రక్తస్రావం అరికట్టినట్లు ఆయన వెల్లడించారు. రోగి ఆరోగ్యపరంగా పూర్తిగా కోలుకోవడంతో నాల్గవ రోజు డిశ్చార్జ్ చేసినట్లు డాక్టర్ నాగార్జున గొట్టిపాటి తెలిపారు. శ్రేష్ట హాస్పిటల్స్‌లో అత్యున్నత నాణ్యత ప్రమాణాలతో కార్డియాలజీ, న్యూరాలజీ, పల్మనాలజీ, గ్యాస్ట్రో ఎంటిరాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, క్రిటికల్ కేర్, గైనకాలజీ, ఈఎన్‌టీ, రేడియాలజీ, డయాబెటాలజీ సేవలు లభిస్తున్నట్లు ఆయన తెలిపారు.


డాక్టర్ నాగార్జున గొట్టిపాటి, పక్కన కాయిల్ టెక్నిక్

కమాండ్ కంట్రోల్ రూమ్‌ను తనిఖీ చేసిన జడ్పీ చైర్‌పర్సన్

గుంటూరు సిటీ, జూలై 30 : ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం పర్యవేక్షించేందుకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలతో జడ్పీలో ప్రారంభమైన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడున్న సిబ్బందితో చైర్‌పర్సన్ కొద్ది సేపు మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల నుంచి పారిశుధ్యం పై వచ్చే ఫిర్యాదులను స్వీకరించి సంబంధింత ఎంపీడీవోలు, తహసీల్దార్‌ల దృష్టికి తీసుకువెళ్తామని సిబ్బంది చైర్‌పర్సన్‌కు వివరించారు. ఆగస్టు 10వ తేదీ వరకు పారిశుధ్యంపై ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ పని చేస్తుందని తెలిపారు. జిల్లాలో అంటువ్యాధులు ప్రబలకుండా ఎంపీడీవోలు ముందస్తు చర్యలు చేపట్టాలని చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఆదేశించారు. పారిశుధ్య కమిటీలు బాధ్యతాయుతంగా పని చేసి అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని అన్నారు.

నార్ల వెంకటేశ్వరరావు ఆడిటోరియం సత్వరమే పూర్తిచేయాలి

గుంటూరు(తూర్పు), జూలై 30 : దాదాపు 25 సంవత్సరాల క్రితం శంకుస్థాపన చేసి కొంత నిర్మాణాన్ని పూర్తి చేసుకొని ఆగిపోయిన నార్ల వెంకటేశ్వరరావు నగరపాలక సంస్థ ఆడిటోరియంను సత్వరమే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొనిరావాలని పశ్చిమ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గళ్లా మాధవికి మంగళవారం సీపీఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. స్థానిక అశోక్‌నగర్ సీపీఐ శాఖ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసిన వారిలో జంగాల అజయ్‌కుమార్, కోటా మాల్యాద్రి, నూతలపాటి చిన్న, మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్ కుమార్, రావుల అంజిబాబు తదితరులు ఉన్నారు.

జనసేన సభ్యత్వం పది లక్షలు దాటడం హర్షణీయం

గుంటూరు, జూలై 30 : జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వానికి ప్రజల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోందని జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ల హరి తెలిపారు. జనసేన పార్టీ సభ్యత్వాలు 10 లక్షలు దాటిన సందర్భంగా మంగళవారం శ్రీనివాసరావుతోటలోని గాజుగ్లాస్ దిమ్మె సెంటర్‌లో జనసేన నాయకులు మిఠాయిలు పంపిణీ చేశారు. జనసేన పార్టీ ప్రస్థానం నేడు పది లక్షల సభ్యులకు చేరడం రాష్ట్ర రాజకీయాల్లో చారిత్రాత్మకమని హరి అన్నారు. పార్టీ నాయకులు బండారు రవీంద్ర, మాదాసు శేఖర్, మిద్దె నాగరాజు, పులి శ్రీకాంత్, వడ్డె సుబ్బారావు, సాయి పాల్గొన్నారు.

కవితా స్రవంతి జీవనరేఖలు పుస్తకావిష్కరణ

గుంటూరు(తూర్పు), జూలై 30: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికగా మంగళవారం కళావిపంచి, హైదరాబాద్, ఆరాధన అకాడమీ గుంటూరు ఆధ్వర్యంలో కళాసారధి నూతలపాటి సాంబయ్య కవితా స్రవంతి జీవనరేఖలు పుస్తకావిష్కరణ సభ జరిగింది. పుస్తకావిష్కర్తగా ఆలయ పాలక మండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, అతిథులుగా వజ్ఝా మధుసూదనరావు, కవి సాహితీ విశ్లేషకులు డాక్టర్ బీరం సుందరరావు, విశ్రాంత ప్రొఫెసర్ వాసిరెడ్డి సత్యనారాయణ వరప్రసాద్, అధ్యక్షులు, జాషువా కళాసమితి, సత్తెనపల్లి, కవి గ్రంథకర్త నూతలపాటి సాంబయ్య, బండారుపల్లి రామారావు, నర్రా శ్రీనివాసరావు, జంపని కిషోర్‌బాబు పాల్గొన్నారు. తొలుత ఆలయ పాలకమండలి అధ్యక్షుడు మస్తానయ్య, అతిథులు జీవన రేఖలు పుస్తకావిష్కరణ చేశారు. సాంస్కృతిక కార్యక్రమంలో వెలగపల్లి సాయి పద్మశ్రీ విజయవాడవారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. కార్యక్రమంలో అధ్యక్షుడు కళావిపంచి బొప్పన నరసింహారావు, అధ్యక్షులు ఆరాధన ఆర్ట్స్ అకాడమీ డీ. తిరుమలేశ్వరరావు, జీవీజీ శంకర్, సయ్యద్ జానీ భాష, జి.మల్లికార్జునరావు పాల్గొని కళాకారులను, అతిథులను సత్కరించారు.

అబ్దుల్ కలాం స్ఫూర్తిని కొనసాగిస్తున్న మంత్రి లోకేశ్

● మైనార్టీ ఆశయ సాధన సమితి అధ్యక్షుడు ఎస్ఎం షరీఫ్

గుంటూరు, జూలై 30 : అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయన స్ఫూర్తిని కొనసాగిస్తూ పథకాల పేర్లు మార్పు చేస్తున్నట్టు లోకేశ్ ప్రకటించడం హర్షణీయమని మైనార్టీ ఆశయ సాధన సమితి అధ్యక్షుడు ఎస్ఎం షరీఫ్ తెలిపారు. స్థానిక సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతులు సర్వేపల్లి రాధాకృష్ణన్, అబ్దుల్ కలాం, డొక్కా సీతమ్మ వంటి మహనీయుల పేర్లు పథకాలకు పెట్టడం బృహత్తరమైన ఆలోచన విధానమని లోకేశ్‌ని షరీఫ్ కొనియాడారు. గత ప్రభుత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ప్రతిభ అవార్డులకు అబ్దుల్ కలాం పేరు తొలగించారని, అలానే విశాఖలో పర్యటన ఆకర్షణలో భాగంగా అబ్దుల్ కలాం వ్యూ పాయింట్‌కు ఉన్న పేరును కూడా తొలగించిన పరిస్థితి అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు జానీ బాషా, ఆసిఫ్ రెహమాన్ ఆరిఫ్ సందాని తదితరులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడ్డ పాత నేరస్థుడు అరెస్టు

● బంగారు వస్తువులు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం

గుంటూరు(కార్పొరేషన్), జూలై 30 : ఇంట్లో చోరీకి పాల్పడ్డ పాత నేరస్తుడిని అరెస్టు చేసినట్లు మంగళవారం పాత గుంటూరు సీఐ బి.రమేష్‌బాబు తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ గుంటూరులోని శివనాగరాజు కాలనీకి చెందిన ఎర్రసాని రాజు అలియాస్ ఇమ్మానుయేల్ దొంగతనాలను వృత్తిగా ఎంచుకొని జీవిస్తున్నాడు. గతంలో నల్లపాడు, అరండల్‌పేట, బెల్లంకొండ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పలు చోరీలకు పాల్పడ్డాడు. తాజాగా పెదకాకాని రోడ్డులోని సీతారామ్‌నగర్ నాలుగో లైనులో నివసిస్తున్న వేణుగోపాల్ ఇంట్లో ఈనెల 27న చోరీ జరిగింది. ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా చొరబడి రెండు గోల్డ్ చైన్లు, ఒక రింగు, రెండు సెల్‌ఫోన్‌లను దొంగిలించాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పాతగుంటూరు పోలీసులు సీసీ ఫుటేజ్‌ల ఆధారంగా కేసు దర్యాప్తు చేశారు. ఈ కేసులో చోరీకి పాల్పడిన నిందితుడిని రాజుగా గుర్తించారు. అతనిని అదుపులోకి తీసుకుని గోల్డ్ చైన్లు, సెల్ ఫోన్‌లను స్వాధీనపరుచుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ రమేష్ బాబు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్సైలు భాగ్యరాజు, అమర వర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గుంటూరు, జూలై 30 : స్థానిక నల్లపాడు స్టేషన్ పరిధిలోని వెంగళాయపాలెం వెళ్ళే జాతీయరహదారి సర్వీసు రోడ్డు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అంకిరెడ్డిపాలేనికి చెందిన శ్యామల రాజగోపాల్‌రెడ్డి (44) అక్కడికక్కడే మృతి చెందాడు. వ్యవసాయం చేసే ఆయన మంగళవారం టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై చిలకలూరిపేట నుంచి గుంటూరు వెళ్ళు సర్వీస్ రోడ్డులో వెంగళాయపాలెం వైపు వెళ్ళే దారి మలుపులో స్రవంతి అనే మహిళ తన స్కూటీపై అజాగ్రత్తగా అతివేగంగా వచ్చి రాజగోపాల్‌రెడ్డిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో రాజగోపాల్‌రెడ్డి అక్కడిక్కడే మృతి చెందగా, స్రవంతికి కూడా గాయాలయ్యాయి. ఈమెను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. రాజగోపాల్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ పోగొట్టుకున్న పర్సు అప్పగింత

గుంటూరు, జూలై 30 : గుంటూరు రైల్వే స్టేషన్‌లో తన చేతిపర్సును పోగొట్టుకున్న ఓ ప్రయాణికురాలికి ఎస్ఐ వెంకటాద్రి, సిబ్బంది అప్పగించారు. వివరాల్లోకి వెళితే... ఈ నెల 29న ఉదయం ఆరు గంటల సమయంలో పుప్పాల లక్ష్మీ ప్రసన్న తన చేతిపర్సును ఫుడ్ స్టాల్ వద్ద పెట్టి మరిచిపోయింది. తర్వాత ఆమె సికింద్రాబాద్ వెళ్లే రైలుకి ప్రయాణమైంది. అయితే జీఆర్‌పి ఎస్ఐ జి.వెంకటాద్రి, సిబ్బంది రైల్వే స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న తరుణంలో ఫుడ్ స్టాల్ వద్ద లక్ష్మీ ప్రసన్న మర్చిపోయిన చేతిపర్సును గమనించి పరిశీలించగా అందులో రూ.3730 నగదు, క్రెడిట్, డెబిట్ కార్డులు ఉన్నాయి. అందులోని వివరాల ఆధారంగా లక్ష్మీప్రసన్నకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆమె మంగళవారం గుంటూరు రైల్వేస్టేషన్‌లోని జీఆర్పి పోలీస్ స్టేషన్ ఎస్ఐ వెంకటాద్రి చేతుల మీదుగా తన పర్సును తీసుకున్నారు. రైల్వే పోలీస్‌అధికారులు, సిబ్బందికి లక్ష్మీప్రసన్న కృతజ్ఞతలు తెలిపారు.

మురికివాడల్లో సౌకర్యాలే ప్రథమ లక్ష్యం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): మురికవాడల్లోని ప్రజల స్థితిగతులు మెరుగుపరచాలని ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. శారద కాలనీ 50వ డివిజన్లో మంగళవారం ఆయన పర్యటించారు. శారదా కాలనీ మార్జిన్ రోడ్డులో చెత్త చెదారం పేరుకుపోయి ఉండడాన్ని గమనించి శానిటరీ అధికారులను తీవ్రంగా మందలించారు. ఇంటింటికీ కుళాయి సదుపాయం కల్పించాలని, ప్రతిరోజూ నీరు వదలాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేదని, శారదాకాలనీలో రోడ్లు, డ్రెయిన్లు వేయుటకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు తక్కువ ఎత్తులో ఉన్న చోట, ఒరిగిన ప్రదేశాలలో సరి చేయాలని, విద్యుత్ తీగలు వేలాడకుండా పైకి లాగాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. పేదల అభివృద్ధే తెలుగుదేశం పార్టీ ప్రథమ లక్ష్యమని, చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అణగారిన వర్గాలను అన్నివిధాలా ఆదుకుంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముప్పవరపు భారతి, ప్రభాకర్, మహంకాళి నరసింహారావు, బాజీ, దయారత్నం, సరోజినీ, మున్సిపల్ శాఖ అధికారులు టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.


పారిశుధ్యంపై అధికారులతో మాట్లాడుతున్న మొహమ్మద్ నసీర్

పారిశుధ్యంపై ఇంతటి నిర్లక్ష్యమా?

● మున్సిపల్ అధికారులపై ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆగ్రహం

గుంటూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పారిశుధ్య చర్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మున్సిపల్ అధికారుల తీరుపై పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని కృష్ణబాబు కాలనీ, గడ్డిమల్లు, శశాంక్ గోయల్ కాలనీలలో మంగళవారం ఆమె పర్యటించారు. పర్యటన ఆసాంతం ఆమెకు డ్రైనేజి సమస్యలే అధికంగా కనిపించాయి. అవే సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేయటంతో మున్సిపల్ అధికారుల తీరుపై ఎమ్మెల్యే మండిపడ్డారు. పారిశుధ్యాన్ని ఇంతలా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని అధికారులను నిలదీశారు. దానికి సమాధానంగా మా వద్ద యంత్రాలు రిపేర్లలో ఉన్నాయని చెప్పటంతో అధికారులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధం లేని సమాధానాలు ఇచ్చి తప్పించుకోవాలంటే కుదరదు అని హెచ్చరించారు. కృష్ణబాబు కాలనీలో ప్రభుత్వ స్కూల్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా తయారయ్యిందని స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. డివిజన్లో గంజాయి విక్రయాలపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో చిన్నమస్తాన్‌వలి, శ్రీకాంత్, బాబు ఖాన్, కసుకుర్తి హనుమంతరావు, మల్లెల మూర్తి, షరీఫ్, జాన్ సైదా, చింతల దేవి, నంది సరస్వతి తదితరులు పాల్గొన్నారు.


రోడ్డుపై పడవేసిన చెత్తను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

ఎమ్మెల్యేను కలిసిన తహసీల్దారు

పశ్చిమ మండల తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన ఫణీంద్రబాబు మంగళవారం ఎమ్మెల్యే గళ్లా మాధవిని ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజలకు నిస్వార్థంగా సేవలు చేయాలని ఆమె తహసీల్దారును కోరారు.

ప్రతిపక్ష హోదా జనం కోసమా.. జగన్ కోసమా? : మన్నవ

గుంటూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్నట్లు వైసీపీ పరిస్థితి తయారైందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. వైనాట్ 175 అంటూ ఎగిరెగిరిపడ్డ జగన్మోహన్‌రెడ్డి, అతడి గ్యాంగ్ ఇప్పుడు అసెంబ్లీలో తమకు ప్రతిపక్షహోదా కావాలంటూ న్యాయస్థానాల ముందు దేహి అనే పరిస్థితి ఎందుకొచ్చిందో ఆలోచించుకోవాలన్నారు. చట్ట సభలంటే జగన్మోహన్‌రెడ్డికి ఏనాడూ గౌరవం లేదని, ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై అసలే నమ్మకం లేదని, సంప్రదాయాలకు విరుద్ధంగా జగన్‌కి ప్రతిపక్షనేత హోదా కావాలని కోరడం సిగ్గుచేటని ఆయన అన్నారు. జగన్‌కు ప్రతిపక్ష హోదా ఇస్తే దాన్ని అడ్డుపెట్టుకుని మళ్లీ కోర్టు వాయిదాలకు వెళ్లకుండా తప్పించుకోవడానికే తప్ప ప్రజల కోసం కాదన్నారు. విధి ఎంతో బలీయమైనదని, దానిముందు ఎవరైనా, ఎంతటివారైనా తలవంచాల్సిందేనన్న విషయం ఇప్పటికైనా వైసీపీ నాయకులు అర్థం చేసుకోవాలన్నారు. రెండు నెలలు కూడా పూర్తి చేసుకోని ఎన్డీయే కూటమి ప్రభుత్వంపై నిత్యం అసత్యాలు, అబద్ధాలతో ఆరోపణలు చేస్తూ, రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నాడని మోహనకృష్ణ విమర్శించారు.

'క్యాట్'కు వేళాయె!



మేనేజ్‌మెంట్ కోర్సు చదవాలి అనుకునే ప్రతి ఒక్కరూ పేరొందిన కాలేజీల్లో చదవాలనుకుంటారు. అలాంటి మేనేజ్‌మెంట్ కోర్సుల అడ్మిషన్ల తొలి అంచెకు ఉద్దేశించిన కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్) నోటిఫికేషన్ వెలువడింది. ఇందులో మంచి పర్సంటైల్ సాధించిన అభ్యర్థులు ఆయా అడ్మిషన్లలో ముందు వరుసలో ఉంటారు.

కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్)-2024 నోటిఫికేషన్ వెలువడింది. క్యాట్ స్కోరు ఆధారంగా ఐఐఎంలే కాకుండా ప్రముఖ కళాశాలలు కూడా సీట్లను భర్తీ చేస్తాయి. దేశ వ్యాప్తంగా 170 నగరాల్లో నవంబరు 24న పరీక్షను నిర్వహించనున్నారు.

ఐఐఎంలు: అహ్మదాబాద్, ముంబయి, అమృత్‌సర్, బెంగళూరు, రాయ్‌పూర్, రాంచీ, రోహ్‌తక్, సంబల్‌పూర్, షిల్లాంగ్, సిర్మోర్, తిరుచిరాపల్లి, ఉదయపూర్, విశాఖపట్నం

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 45 శాతం మార్కులు చాలు. డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహిస్తారు. గతంలో నిర్వహించిన క్యాట్ పరీక్షల ప్రకారం... మొత్తం 198 మార్కులకు ప్రశ్న పత్రం ఉంటుంది. పరీక్షలో మూడు విభాగాలు ఉంటాయి. సెక్షన్-1 వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్, సెక్షన్-2 డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్, సెక్షన్-3 క్వాంటిటేటివ్ విభాగాల నుంచి మొత్తం 66 ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు 3 మార్కులు కేటాయిస్తారు. పరీక్ష వ్యవధి 2 గంటలు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఆయా సంస్థలు గ్రూప్ డిస్కషన్స్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేస్తాయి.

రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.2500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.1250 చెల్లించాలి.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అనంతపురం, చిత్తూరు, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తేదీలు:** ఆగస్టు 1 నుంచి సెప్టెంబరు 13 వరకు
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ తేదీలు:** నవంబరు 5 నుంచి
- **పరీక్ష తేదీ:** నవంబరు 24
- **ఫలితాల ప్రకటన:** జనవరి 2025
- **వెబ్‌సైట్:** https://iimcat.ac.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/rdmwKnPలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

ఎన్ఐఈపీఐడీలో డిప్లొమా

సికింద్రాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఐడీ)- 'డిప్లొమా ఇన్ ఇండియన్ సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటేషన్(డీఐఎస్ఎల్ఐ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏడాదికి 1200 గంటలు చొప్పున మొత్తం 2400 గంటల బోధన ఉంటుంది. ఇండియన్ సైన్ లాంగ్వేజ్, ఇంగ్లీష్/హిందీ మాధ్యమాల్లో తరగతులు నిర్వహిస్తారు. ప్రాంతీయ భాషల్లో కూడా వివరణ ఇస్తారు. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ఈ కోర్సులో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు నెలకు రూ.2,000ల స్టయిపెండ్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఇంగ్లీష్/హిందీ భాషలో ప్రావీణ్యం తప్పనిసరి. సాధారణ స్థాయిలో వినికిడి సామర్థ్యం ఉండాలి.

ఉద్యోగావకాశాలు: ఈ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు ప్రభుత్వ/ప్రైవేట్ సంస్థల్లో సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటర్స్‌గా చేరవచ్చు. మూగ-చెవిటి పిల్లలకు, సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటర్స్‌కు ఇన్‌స్ట్రక్టర్లుగా అవకాశాలు ఉంటాయి.

- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 20
- **వెబ్‌సైట్:** www.niepid.nic.in

SCHOLARSHIP ALERT

Description: Blue Star Foundation aims at supporting and empowering underprivileged undergraduate and diploma students enrolled in Architecture and Engineering programmes at select private or government colleges across India through their flagship initiative, i.e. Mohan T Advani Centennial Scholarship Programme.

Mohan T Advani Centennial Scholarship

Eligibility: First and second-year students enrolled in a degree programme in architecture and engineering, such as Electronics Engineering, Mechanical Engineering, Information Technology (IT), Computer Science (CS), and related STEM fields, excluding Civil Engineering. Applicants must have scored a minimum of 80% in Class 10 and Class 12 for first-year students, and at least 80% in Class 12 and 75% in the 1st year for second-year students. Students enrolled in specified colleges* will be eligible to apply. Applicants' annual family income from all sources must be less than INR 6 lakh. Recipients should not be beneficiaries of any other scholarship.

Prizes & Rewards: For engineering and architecture students: INR 75,000 or 50% of the annual fees (whichever is less)

For Diploma Students: INR 30,000 or 75% of the annual fees (whichever is less)

Last Date to Apply: 20-08-2024

Short Url: www.b4s.in/aj/BSFS2

HOPE Engineering Scholarship

Description: Schaeffler India invites applications from first-year engineering female students (preference will be given to students with physical disabilities) to provide them with financial support for their engineering studies.

Eligibility: The scholarship is open to female students and preference will be given to students with physical disabilities. The applicants must have scored more than 60% marks in Class 12 (science) in the academic year 2023-24. They must be enrolled in the first year of an engineering program at any recognized college in India. The annual family income of the applicants should be less than INR 5 lakh.

Prizes & Rewards: Scholarship of INR 50,000

Last Date to Apply: 15-08-2024

Short Url: www.b4s.in/aj/SIHE15

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి

మమ్మల్ని సంప్రదించకుండానే చర్యలు తీసుకుంటారా?

నిర్మాతల మండలిపై నడిగర్ సంఘం ఆగ్రహం



వివిధ అంశాలపై తమిళ నిర్మాతల మండలి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుందంటూ 'నడిగర్ సంఘం' ఆగ్రహం వ్యక్తం చేసింది. తమను సంప్రదించకుండా చర్యలు ఎలా తీసుకుంటారని నిలదీసింది. తమిళ నిర్మాతల మండలి సోమవారం సమావేశమై పలు తీర్మానాలు ఆమోదించిన విషయం తెలిసిందే. నటీనటులు, సాంకేతిక నిపుణుల పారితోషికాలు క్రమబద్ధీకరించాలని, ఆగస్టు 16 తర్వాత కొత్త సినిమాల షూటింగ్ చేపట్టకూడదని, నవంబరు ఒకటి నుంచి సినిమా షూటింగ్‌లు నిలిపివేయాలని.. ఇలా ఆరు తీర్మానాలు ఆమోదించింది. ఇలా ఏకపక్షంగా తమిళ నిర్మాత మండలి నిర్ణయాలను తీసుకోవడాన్ని నడిగర్ సంఘం తీవ్రంగా ఖండించింది. . సినీ రంగంపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయని, ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా షూటింగులు నిలిపివేస్తామని తీర్మానం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించింది. పారితోషికాలు సహా ఇతర సమస్యలపై నడిగర్ సంఘం సహా మిగిలిన సంఘాలతో చర్చించి నిర్ణయం తీసుకుని ఉంటే బాగుండేదని అభిప్రాయపడింది.

> **హీరో ధనుష్‌పై తీర్మానం చేయడం సమంజసం కాదని, ఆయనపై నడిగర్ సంఘానికి ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని స్పష్టం చేసింది.**

అలాగే ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, ఈ వ్యవహారంపై తదుపరి చేపట్టాల్సిన చర్యలపై తమ సంఘం కార్యనిర్వాహకుల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని నడిగర్ సంఘం ప్రకటించింది.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

పురస్కారాలకు పరిష్కారం దొరికేనా?

అసంతృప్తో, ఆగ్రహమో... 'గద్దర్ పేరుతో సినీ పురస్కారాలు ఇస్తామంటే ముందుకు రారా...' అంటూ ముఖ్యమంత్రి బహిరంగ వేదికపై నుంచి అన్న ఒక్క మాట తెలుగు చలన చిత్ర పరిశ్రమను ఉలిక్కిపడేలా చేసింది. చిత్ర పరిశ్రమలోని సంఘాలు ఆయన ఆహ్వానాన్ని పక్కనపెట్టే ధైర్యం చేశాయా? ఏమీ తెలియనట్లే ఉంటూ తలెగరేసే సాహసం సినీ పెద్దలు చేయగలరా? ముఖ్యమంత్రి మాటల్లోని మర్మం ఏమిటి? అనేదే ఇప్పుడు నడుస్తున్న చర్చ.



సినిమావాళ్ల ప్రభుత్వాలకు చేసుకునే వినతులలో భాగంగానే ఇన్నాళ్లూ నంది పురస్కారాల అశం వార్తల్లో నిలుస్తూ వస్తోంది. అయితే ఇప్పుడు మాత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలతో వార్తల్లో నిలవడమే ఆసక్తిని కలిగిస్తోంది. నేడో రేపు ఫిల్మ్ అవార్డ్స్ గురించి నోటిఫికేషన్ వస్తుందని అందరూ ఎదురుచూస్తున్న తరుణంలో సీఎం చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరో పక్క ఈ అవార్డుల గురించి చర్చించేందుకు మేం ముఖ్యమంత్రిని కలిసేందుకు ప్రయత్నించాం, కానీ వీలు కాలేదు అనే మాట కొంతమంది సినిమా పెద్దల చెబుతున్నారు.

సినిమా పండుగలా పురస్కారాల వేడుక

నంది పురస్కారాలను చిత్ర పరిశ్రమ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తుంది. ప్రతి ఏటా ఉగాది నాడు నంది పురస్కారాల ప్రధానోత్సవం ఆనవాయితీగా వస్తోంది. ఆ వేడుకను ఇండస్ట్రీ మొత్తం పండుగలా జరుపుకునేది. అయితే 2014లో తెలంగాణ ఏర్పడ్డాక అప్పటి ప్రభుత్వం నంది పురస్కారాల స్థానే 'సింహ' పేరుతో కొత్తగా పురస్కారాలను ఇవ్వనున్నట్లు ప్రకటించింది. నామినేషన్లను సైతం స్వీకరించింది. కానీ దశాబ్ద కాలంలో సినీ ప్రముఖులు ఎన్ని విన్నపాలు చేసినా అది కార్యరూపం మాత్రం దాల్చలేదు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎందుకనో సినీ పురస్కారాలపై ఆసక్తి చూపలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నంది పురస్కారాలను ఇచ్చే సంప్రదాయాన్ని మళ్లీ కొనసాగించాలంటూ పలు వేదికలపై నుంచి చిత్ర పరిశ్రమ తరపున సినీ సంఘాలు, కొంతమంది సినీ ప్రముఖులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కొంత ఒత్తిడి తెచ్చే ప్రయత్నం కూడా చేశారు. జనవరిలో ప్రజా గాయకుడు గద్దర్ సంస్మరణ సభలో 'గద్దర్ అవార్డ్స్' పేరుతో సినీ పురస్కారాలను ఇస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీని అమలుపై అభిప్రాయాలు, సలహాలు అందించాలని చిత్ర పరిశ్రమ పెద్దలను కోరారు. సినీ ప్రముఖులు సైతం ముఖ్యమంత్రి నిర్ణయాన్ని అభినందించి, మద్దతు తెలిపారు. తర్వాత మాత్రం ఎలాంటి కదలికా లేదు. కానీ మంగళవారం నాడు ముఖ్యమంత్రి వ్యాఖ్యలతో నంది పురస్కారాల అంశం అనూహ్యంగా తెరపైకి వచ్చింది.

గద్దర్ పేరుతో అవార్డులు ఇష్టం లేదా?

ఏకంగా ముఖ్యమంత్రే బహిరంగంగా అసంతృప్తిని వ్యక్తం చేసే దాకా పరిస్థితి వచ్చిందంటే చిత్ర పరిశ్రమలోని సంఘాలు, సినీ ప్రముఖులు ఏం చేసుంటారు అనే చర్చ జరుగుతోంది. సినిమావాళ్లు బయటపడలేదు గానీ గద్దర్ పేరుతో పురస్కారాలను స్వీకరించడం ఇష్టంలేదనే చర్చ అప్పట్లోనే బహిరంగంగా నడిచింది. ఆ కారణంతోనే సినీ ప్రముఖులు సీఎంను కలసి పురస్కారాల విషయంపై సంప్రదింపులు జరపలేదనే మాట వినిపిస్తోంది. పరిశ్రమ నుంచి ఒక కమిటీగా ఏర్పడి ముఖ్యమంత్రిని కలిసే ప్రయత్నం చేయకపోవడం అలాంటి అభిప్రాయాలకు ఊతమిచ్చింది. 'సినిమా వాళ్లే రాలేదు' అని సీఎం అంటే 'ముఖ్యమంత్రి అపాయిట్‌మెంట్ దొరకలేద'నేది సినీ పెద్దలు మాట. జరిగిందేదో జరిగిపోయింది, సినీ ప్రముఖులు, ముఖ్యమంత్రి కలసి పురస్కారాల అంశాన్ని ఓ కొలిక్కితేవాలనేదే ఇప్పుడు పరిశ్రమ ఆకాంక్ష.

స్వయంగా పిలిచినా స్పందించలేదు



నంది పురస్కారాలకు మల్లే తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డులను ఇవ్వాలనుకుంటోంది. నా అంతట నేనే అడిగినా, ఎవరూ ముందుకు రావడం లేదు. ఇది సరికాదు. పురస్కారాల విషయంలో సినీ పరిశ్రమ మౌనంగా ఉంటోంది. గద్దర్ జయంతి సందర్భంగా డిసెంబర్ 9న సినీ పురస్కారాలను ఇవ్వడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉందని గతంలో చెప్పాను. ఈ విషయాన్ని మరోసారి తెలుగు పరిశ్రమకు గుర్తు చేస్తున్నాను. మీ విజ్ఞప్తి కంటే ముందే ఒక అడుగు ముందుకేసి ప్రకటన చేశాను. ప్రతిపాదనతో రావాలని పరిశ్రమ వర్గాలను కోరాను. కారణాలేమిటో తెలియదు కానీ సినీ ప్రముఖులు ఇప్పటివరకూ ప్రభుత్వాన్ని సంప్రదించలేదు. తెలుగు చిత్ర పరిశ్రమ కృషి, విజయాలకు గౌరవంగా గద్దర్ అవార్డులను ప్రకటించాం. సినీ పరిశ్రమ పెద్దల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరం. ఇప్పటికైనా పరిశ్రమ పెద్దలు ముందుకు వస్తే అందరం కలసి ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్దాం.

- ఏ. రేవంత్‌రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి


ఆ బాధ్యత ఫిలిం ఛాంబర్ తీసుకోవాలి



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారు చొరవ తీసుకొని సినిమా అవార్డులను పునరుద్ధరించే నిర్ణయం తీసుకోవడం సంతోషకరం. ప్రజా కళాకారుడు గద్దర్ గారి పేరు మీదుగా, ప్రతి ఏటా 'గద్దర్ అవార్డ్స్' తెలంగాణ ప్రభుత్వం తరపున ఇస్తామని వారు ప్రకటించారు. తెలుగు పరిశ్రమ తరపున, ఫిలిం ఛాంబర్, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లే బాధ్యత తీసుకోవాలి.

- చిరంజీవి

గద్దర్ అవార్డ్స్‌పై అభ్యంతరం లేదు



మేం ముఖ్యమంత్రిని కలిసేందుకు పలుమార్లు ప్రయత్నించాం. కానీ సీఎంఓ నుంచి మాకు పిలుపు రాలేదు. అందువల్లే ముఖ్యమంత్రిని కలవలేకపోయాం. గద్దర్ పేరుతో అవార్డ్స్ తీసుకోవడానికి మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. సీఎం ఎప్పుడు పిలిచినా వెళ్లి కలుస్తాం.

- నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ

సీఎంను కలిసిన సినీ నటుడు అర్జున్



సీఎం రేవంత్‌రెడ్డిని సినీ నటుడు అర్జున్ మంగళవారంనాడు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా.. సంత్ శ్రీరామ్‌రావ్ జయంతి సందర్భంగా బుధవారంనాడు నిర్వహిస్తున్న మహా హోమంకు రావాల్సిందిగా సీఎం రేవంత్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ కోరారు. అసెంబ్లీలోని సీఎం ఛాంబర్లో కలిసి ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు.

రాణీగా గర్వపడుతున్నాను




విభిన్నమైన పాత్రలతో కథానాయికగా తనదైన పంథాలో కొనసాగుతున్నారు తాప్సీ. 'ఫిర్ ఆయా హసీన్ దిల్‌రుబా' చిత్రంతో ఆమె ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. గతంలో వచ్చిన 'హసీన్ దిల్‌రుబా' చిత్రానికి ఇది కొనసాగింపు. అందులో ఆమె రాణి అనే గృహిణి పాత్రలో కనిపించారు. ఇప్పుడు రెండో భాగంలోనూ అదే పాత్రలో కనిపించనున్నారు. 'ప్రతినాయక ఛాయలున్న పాత్ర కావడం వల్ల కొంతమందికి నచ్చలేదు. నాకు బాగా నచ్చింది. ఇలాంటి పాత్రను పోషించినందుకు గర్వపడుతున్నాను' అని తాప్సీ పేర్కొన్నారు. ఆగస్టు 9న ఈ చిత్రం ఓటీటీలో విడుదలవుతోంది.

ప్రొడ్యూసర్ టాక్

ప్రతి శుక్రవారం కొన్ని సినిమాలను విడుదల చేయడం తెలుగు చిత్రపరిశ్రమలో ఒక ఆనవాయితీ. ఆ ఒక్క రోజుతోనే చాలా మంది సినిమావాళ్ల జాతకాలు మారిపోతుంటాయి. అందుకే శుక్రవారం కోసం చిత్ర ప్రముఖులతో పాటు ప్రేక్షకులూ ఆశగా ఎదురుచూస్తుంటారు. ఈ శుక్రవారం కూడా అశ్విన్‌బాబు హీరోగా నటించిన 'శివం భజే' చిత్రం గురువారం, రాజ్ తరుణ్ హీరో పాత్ర పోషించిన 'తిరగబడరా సామీ' సినిమా శుక్రవారం విడుదలవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా చిత్రాల నిర్మాతలు మల్కాపురం శివకుమార్, మహేశ్వరరెడ్డి మూలి మీడియాతో ముచ్చటించారు.

'తిరగబడరా సామీ'లో కంటెంట్ బాగుంటుంది



భార్యాభర్తలు మూడు ముళ్ల బంధానికి ఎలా కట్టుబడి ఉండాలో సినిమాలో చూపించామనీ, కంటెంట్ బాగుంటుందనీ నిర్మాత మల్కాపురం శివకుమార్ చెప్పారు.

- సైలెంట్‌గా ఉన్న వ్యక్తిని వైలెంట్‌గా మార్చేవి పరిస్థితులే. ఈ కథలో అలాంటి పరిస్థితులే ఉంటాయి. ఒక సాధారణ యువకుడు పరిస్థితుల ప్రాబల్యంతో ఎలా మారాడన్నది ఆసక్తికరంగా ఉంటుంది. రాజ్ తరుణ్ అద్భుతంగా నటించాడు.
- ప్రతి సినిమాతో కొత్త వారిని పరిచయం చేయాలన్నది నా ఉద్దేశం. గత సినిమాల్లో లాగానే ఈ చిత్రంతో మాల్వీ మల్హోత్రా హీరోయిన్‌గా పరిచయమవుతోంది.

> **సినిమా అంటే ప్రేమతో చిత్రపరిశ్రమలోకి వచ్చాను. కానీ ఇక్కడ సంపాదించింది ఏమీ లేదు. కాకపోతే మనం బతుకుతూ పదిమందిని బతికించే ఏకైక పరిశ్రమ ఇది. సినిమా సక్సెస్ అయితే దాని మీద ఆధారపడిన ఎన్నో జీవితాలు బాగుంటాయి.**

- మన్నారా చోప్రా ఇందులో నెగెటివ్ ఫీమేల్ లీడ్ చేసింది. ఆ పాత్రకు ఆమె యాప్ట్. సినిమా అంతా ఉంటుంది.
- ఈ సినిమా షూటింగ్ దాదాపుగా జహీరాబాద్‌లో చేశాం. అది మా నేటివ్ ప్లేస్. చాలా సరదాగా వర్క్ జరిగింది.
- దర్శకుడు రవికుమార్ చౌదరి చాలా హార్డ్ వర్క్ చేశారు. చెప్పినదానికంటే అద్భుతంగా తీశారు. వెరీగుడ్ డైరెక్టర్.
- జీడీ చక్రవర్తి, నరేశ్ అగస్త్య , సీరత్‌కపూర్‌తో ఓ సినిమా జరుగుతోంది. శ్రవణ్ అనే కొత్త దర్శకుడిని పరిచయం చేస్తున్నా. అలాగే రాహు కేతు అనే వెబ్ సిరీస్ కూడా చేస్తున్నాం.

ట్రైలర్ చూసి వెంకటేశ్ మెచ్చుకున్నారు



హీరో అశ్విన్‌బాబు, తన పుట్టినరోజు ఆగస్టు ఒకటిన కావడం వల్ల అదే రోజు సినిమా విడుదల చేయడం లేదనీ, అన్ని రకాలుగా అనుకూలంగా ఉండడం వల్ల ఆ రోజు విడుదల చేస్తున్నామనీ మహేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. ఆయన చెప్పిన వివరాలు ఇవి.

- ముందు పెద్ద సినిమాలు రాబోతున్నాయి. అందుకే ఈ వారం విడుదల చేయడమే కరెక్ట్ అని నిర్మాతగానే కాకుండా డిస్ట్రిబ్యూటర్‌గా కూడా ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నాను.

> **కథలో చాలా లేయర్స్ ఉన్నాయి. ఐదారు జానర్లు కలిపినట్టు ఉంటుంది. అందరినీ ఆకట్టుకొనే అంశాలు చాలా ఉన్నాయి. క్వాలిటీ, కంటెంట్ కోసం అనుకున్న దానికంటే ఎక్కువే ఖర్చు పెట్టాను.**

- విక్టరీ వెంకటేశ్ మా ట్రైలర్ చూసి మెచ్చుకున్నారు. ఆయనకి, అశ్విన్‌కు క్రికెట్ పరంగా మంచి రిలేషన్ ఉంది. ట్రైలర్ చూసి బాగుందని ఆయన మెచ్చుకున్నారు.
- ఈ సినిమాకు సంగీత దర్శకుడు వికాసే హీరో. 'హిడింబ' చిత్రం చూసి ఆయన్ని తీసుకున్నాం. మంచి పాటలు, అద్భుతమైన ఆర్ఆర్ ఇచ్చారు.
- 'శివం భజే' హిట్ అయితే తమిళంలో రీమేక్ చేస్తాం. ఐబీటీ కృష్ణమూర్తి టీమ్‌తో ఓ సినిమా ప్లాన్ చేస్తున్నా. కార్తికేయతో కూడా చిత్రం చేయాలనుకుంటున్నాం.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



మురుగునీటి పంపింగ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న తదితరులు

శుద్ధి యంత్రాల పనితీరును మెరుగుపర్చండి

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట జూలై 30: పట్టణంలో పారుతున్న వేల లీటర్ల మురుగునీటిని శుద్ధిచేసే యంత్రాల పనితీరును మెరుగుపరచాలని పట్టణ మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులను ఆదేశించారు. స్థానిక చెంచుపేటలో మంగళవారం పురపాలక సంఘ పట్టణ మురుగునీటి పంపింగ్ స్టేషన్‌ను మున్సిపల్ కమిషనర్ శేషన్న క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా శేషన్న అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పట్టణంలో పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టిని పెట్టారని, అధికారులు సమన్వయంతో కలసి పనిచేయాలన్నారు. పట్టణంలో పలు వార్డులలోని మురుగునీటిలోని వ్యర్థాలను వేరుచేసి, శుద్ధి చేయాలన్నారు. పారిశుధ్య పనులలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులను హెచ్చరించారు. అనంతరం జిల్లా ప్రభుత్వ వైద్యశాల రోడ్డులోని అన్న క్యాంటీన్ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.



డెంగీ పరీక్షలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ, డాక్టర్ వరప్రసాద్, నవీన్ తదితరులు

జిల్లా వైద్యశాలలో డెంగీ పరీక్షలపై అవగాహన

తెనాలి, మారీసుపేట జూలై 30: జిల్లా వైద్యశాలలో డెంగీ పరీక్షలపై అవగాహన కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీ సుబ్బరాయణం నిర్వహించారు. స్థానిక చెంచుపేటలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలోని ఎస్ఎస్‌హెచ్ ల్యాబ్‌లో మంగళవారం డెంగీ పరీక్ష కిట్లను, డెంగీ పరీక్ష విధానాలను జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం పరిశీలించి, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని జిల్లా లాబ్‌లో డెంగీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. డెంగీ వ్యాధినిబట్టి వైద్యుల సలహా మేరకు ఈ పరీక్షలను ఉచితంగా నిర్వహించి ఫలితాలను వెల్లడిస్తారన్నారు. మందులు, చికిత్స ఉచితంగా అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఏపిడిమాలజిస్ట్ డాక్టర్ వరప్రసాద్, ల్యాబ్ ఇన్‌చార్జ్ డి.సుధీర్, మైక్రోబయాలజిస్ట్ నవీన్, సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి, సబ్‌యూనిట్ అధికారులు వంగల పున్నారెడ్డి, శ్రీకంఠ ఉమాకాంత్, శివగణేష్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, ఆరోగ్య పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

యాచకుడు మృతి

తెనాలి, మారీసుపేట జూలై 30: పట్టణంలో యాచకుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి చెంచుపేటలోని జెండా చెట్టు బజారులో వృద్ధుడు (55) యాచిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడని తెలిపారు. సోమవారం అర్ధరాత్రి సమయంలో అరుగుపై నుంచి ప్రమాదవశాత్తు మురుగు కాల్వలో పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ వైద్యశాల శవాగారానికి తరలించినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.



హెల్మెట్‌ధారణపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

హెల్మెట్ ధారణపై అవగాహన

తెనాలి అర్బన్, జూలై 30: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని టూ టౌన్ ఎస్ఐ బాబురావు తెలిపారు. మంగళవారం లీగల్ అథారిటీ ఆదేశాల మేరకు పలు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రధాన కూడళ్లలో హెల్మెట్ అవశ్యకతను వివరించారు. తక్కువ దూరం అని భావించి హెల్మెట్ ధరించడం లేదని వారికి కూడా పెనాల్టీ విధిస్తామన్నారు. ఏఎస్ఐ శ్రీనివాసరావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ రోడ్డులో అన్నదానం



అన్నదానం చేస్తున్న శివలింగేశ్వరస్వామి భక్త బృందం కమిటీ

తెనాలి అర్బన్, జూలై 30: పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో మంగళవారం పేదలకు అన్నదానం చేశారు. శివలింగేశ్వరస్వామి భక్త బృందం కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పాలడుగు లక్ష్మీనారాయణ సహకారంతో నిర్వహించిన అన్నదానంలో రవికాంత్, గోపాల్, సుబ్రహ్మణ్యం, సాయి, నాగసాయి తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ పుస్తక ప్రదర్శన

తెనాలి అర్బన్, జూలై 30: స్థానిక పుట్టి నాగేశ్వరరావు ఫంక్షన్ హాలులో మంగళవారం క్రైస్తవ పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేశారు. చెన్నైకు చెందిన ది లేమెన్స్ ఇవాంజలికల్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రదర్శనను మైనారిటీస్ వైస్ చైర్మన్ జాషువా డానియేల్ ప్రారంభించారు. ఎంతోమంది క్రైస్తవ మిషనరీలు, సాక్షులు, ప్రవక్తలు, జీవిత విశేషాలను వారి పేర్లతో చేస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవచ్చన్నారు. ప్రదర్శనశాల కన్వీనర్ బ్రదర్ జోనాదన్ రూపస్ మాట్లాడుతూ, ఆగస్టు 5 వరకు ప్రదర్శన జరుగుతుందని, చర్చిలకు కావాల్సిన పుస్తకాలన్నీ లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఆడమ్ కెనడీ, యేసురత్నం, సర్వోత్తమరావు, పాల్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అవసరం

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర, జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్సీ కల్పలత తదితరులు

పెదకాకాని, జూలై 30: పాఠశాల అభివృద్ధిలో దాతల సహకారం చాలా అవసరం అని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పిలుపునిచ్చారు. పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామం వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బండి సాహితిరెడ్డి కళావేదిక ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా పాల్గొని కళావేదికను ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు, విద్య ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రిగా నారా లోకేశ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సంస్కరణలు తీసుకొచ్చారని అన్నారు. అందులో భాగంగా చదువుతున్న విద్యార్థులందరికీ తల్లికి వందనం పేరుతో రూ.15వేల రూపాయలు ఇవ్వటం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథకానికి డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనంగా నామకరణ చేశారన్నారు. మనబడి - మన భవిష్యత్తు పేరుతో ప్రభుత్వ స్కూల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ స్కూల్లో ప్రతిభ కనబరిచిన వారికి అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారాలు అందజేయటం జరుగుతుందన్నారు. ఇంతవరకు ఏ రాష్ట్రంలో మొదలుపెట్టని ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందజేయడం ఎంతో అభినందనీయం అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన స్కూల్ యూనిఫామ్, బ్యాగులు, షూస్, బెల్టు టై కూడా ఇస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యాశాతం మెరుగ్గా ఉండాలని దానికోసం ప్రభుత్వ టీచర్లు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా, గుంటూరు జిల్లా టీచర్ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

గుంటూరు జిల్లా సీనియర్ సివిల్ జడ్జి లీలావతి



ప్రసంగిస్తున్న గుంటూరు జిల్లా సీనియర్ సివిల్ జడ్జి టి.లీలావతి

పెదకాకాని, జూలై 30: మానవ అక్రమ రవాణాని అరికట్టాలని గుంటూరు జిల్లా సీనియర్ సివిల్ జడ్జి టి.లీలావతి తెలిపారు. మంగళవారం పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో 'మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని' పురస్కరించుకొని జరిగిన కార్యక్రమంలో జడ్జి లీలావతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి లీలావతి మాట్లాడుతూ బలవంతంగా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించిన పిల్లలను, పెద్దలను కూడా పెద్దపెద్ద కంపెనీలలో, కర్మాగారాలలో, మసాజ్ సెంటర్లలో, లేదా వ్యభిచార వృత్తిలోకి వారికి ఇష్టమున్నా లేకపోయినా దించుతారన్నారు. ప్రస్తుత సమాజంలో భార్యాభర్తలు ఇద్దరు కూడా ఉద్యోగాల నిమిత్తం బయటకు వెళ్తున్నారని, పిల్లలు స్కూల్, కాలేజీల నుంచి వచ్చేసరికి ఇంటి వద్ద పెద్దవారు ఎవరు ఉండటం లేదన్నారు. దీనివల్ల పిల్లలను సరైన మార్గంలో నడిపించేవారు లేకుండా పోతుందన్నారు. డబ్బు సంపాదనలోపడి మనం పిల్లలను పూర్తిగా విస్మరిస్తున్నామన్నారు. ఈ సమయంలో కొత్త వ్యక్తుల పరిచయాలకు ఆకర్షితులై వారు చెప్పే స్వార్థపూరితమైన మాటలు నమ్మి దురలవాట్లకు బానిసలై పోతున్నారన్నారు. ఈ క్రమంలోనే అక్రమ రవాణాకు గురవుతున్నారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ జి.ప్రమీల, లత, రూబీ, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు, సమాజం గర్వించేలా విద్యార్థులు ఎదగాలి: న్యాయాధికారి వివేకవర్ధన్



ప్రసంగిస్తున్న న్యాయాధికారి వివేకవర్ధన్

తెనాలి క్రైం, జూలై 30: తల్లిదండ్రులు సమాజం గర్వించేలా విద్యార్థులు భవిష్యత్తుకు పాఠశాల, కళాశాల స్థాయిలోనే బాటలు వేసుకోవాలని ఒకటవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వివేకవర్ధన్ తెలిపారు. అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక జేఎంజే కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ విద్యార్థి దశలో తప్పటడుగులు పడకూడదని, వివేకశీలత, సృజనాత్మకత, నవీకరణలపై విద్యార్థి దశలోనే దృష్టి సారించాలన్నారు. ఈ దశలోనే వ్యక్తిత్వాన్ని వికసింపజేసుకోవాలి అప్పుడే భవిష్యత్తులో అనుకున్నది సాధించగలుగుతారన్నారు. మన ఆలోచనలే మనకు మార్గాన్ని నిర్దేశిస్తాయని, అందుకే సరైన ఆలోచన విధానంలో ముందడుగు వేయాలన్నారు. ఇటీవల కాలంలో విద్యార్థి దశలోనే ఎక్కువగా పెడధోరణలను గమనిస్తున్నామన్నారు. సామాజిక మాధ్యమాల ప్రభావం పర్యవేక్షణ లోపం, నైతిక విలువల పతనం దీనికి కారణమన్నారు. నేరాన్ని కూడా విజయంగా భావించే తెలిసీ, తెలియని మానసిక స్థితి ఆన్‌లైన్ గేమ్స్ మాదక ద్రవ్యాలు ఇలా అనేక కారణాలతో విద్యార్థులు పాఠశాల కళాశాల స్థాయిలోనే గాడి తప్పుతున్నారన్నారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నైతిక విలువలను బోధించాలన్నారు. పాఠశాల స్థాయి నుంచే పిల్లలను పర్యవేక్షిస్తూ ఉండాలని, లేదంటే వారి ఉన్నత భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకునే ప్రమాదం ఉందని న్యాయాధికారి తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ మాట్లాడుతూ జీవితంలో విద్యార్థి దశ అత్యంత కీలకం అన్నారు. ఈ దశలో ఎలాంటి ఆకర్షణలకు లోనుకాకుండా తల్లిదండ్రులు తమపై ఉంచిన ఆశలను నెరవేర్చేందుకు దృష్టి సారించాలన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీ, త్రీటౌన్ ఎస్ఐ ప్రకాష్, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది మహబూబ్, యర్రంశెట్టి అనీల్‌కుమార్, విజయ్, కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా అభయహస్త సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం





పుష్పాలంకరణలో శ్రీఅభయహస్త సుబ్రహ్మణ్యస్వామి, స్వామివార్ల కల్యాణ మహోత్సవంను నిర్వహిస్తున్న అర్చకులు

తెనాలి రూరల్, జూలై 30: మండలంలోని పెదరావూరులో కొలువుదీరి ఉన్న మహావిద్యాపీఠం శ్రీఅభయహస్త సుబ్రహ్మణ్యక్షేత్రంలో స్వామివార్ల కల్యాణం కనులపండుగగా జరిపారు. ఆడికృత్తిక మహోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి కావడిసేవ, మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేక పూజలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ ప్రాంగణంలోని పరమాచార్య మండపంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు కల్యాణం కనుల పండుగగా జరిపారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామివారి మూలవిరాట్‌కు శత్రుసంహార సుబ్రహ్మణ్య త్రిశతి అర్చన, నీరాజన మంత్ర పుష్పాలు, తీర్థప్రసాద వినియోగం జరిగింది. చింతపల్లి సుబ్రహ్మణ్యశాస్త్రి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమాల్లో శుభం శర్మ, నరసింహమూర్తి, వివిధ గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శాకాంబర కృష్ణగా సంతాన వేణుగోపాల స్వామి



ప్రత్యేక పూజలందుకున్న శ్రీ వేణుగోపాల స్వామి

చేబ్రోలు, జూలై 30: ఆషాడమాసం కామికా ఏకాదశి సందర్భంగా చేబ్రోలు మండలంలోని శలపాడు గ్రామంలోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల కూరగాయలు పండ్లతో శాకాంబరకృష్ణ పరమాత్మగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విష్ణుప్రసాద్

ఇంటి వద్దే పింఛన్ పంపిణీ చేయాలి

● ఎంపీడీవో విష్ణుప్రసాద్

కొల్లిపర, జూలై 30: ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం ఆగస్టు నెలలో 1వ తేదీన పింఛన్‌ను ఇంటివద్దే పంపిణీ చేయాలని ఎంపీడీవో విష్ణుప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ, వార్డు, సచివాలయం ఉద్యోగులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణుప్రసాద్ మాట్లాడుతూ మండలంలో 9వేల 821 పెన్షన్‌లకు రూ.4 కోట్ల 5వేల 500లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. 15 సచివాలయాలకు ప్రత్యేక అధికారులతో పాటు 161మంది సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని వారి పర్యవేక్షణలో పింఛన్లను ఉదయం 6గంటల నుంచి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పింఛనుదారులు ఇంటి వద్దనే ఉండాలన్నారు. సమావేశంలో ఏవో వెంకట్రావు, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, పీఆర్ ఏఈ రవిశంకర్, ఎంఈవో ఝాన్సీలత, పరిపాలనాధికారి చంద్రమోహన్, ఈవోపీఆర్‌డీ పూర్ణశంకరరావు, డీఆర్‌డీఏ ఏపీఎం ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

పరుచూరి సతీమణి నాగశిరోమణి మృతి



నాగశిరోమణి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

తెనాలి అర్బన్, జూలై 30: సీపీఎం రాష్ట్ర మాజీ నాయకులు దివంగత పరుచూరి నాగేశ్వరరావు సతీమణి నాగశిరోమణి మృతిచెందారు. నెల్లూరులో తన కుమారుని వద్ద నివాసం ఉంటున్న ఆమె భౌతికకాయాన్ని మంగళవారం తెనాలిలోని నివాసానికి తరలించారు. అంత్యక్రియలు బుధవారం నిర్వహిస్తామని కుమారుడు డాక్టర్ అజయ్‌కుమార్ తెలిపారు. రాజ్యసభ మాజీ సభ్యుడు పి.మధు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు పిన్నమనేని మురళి, జయరామ్, జిల్లా సభ్యులు భవన్నారాయణ, నేతాజీ, బాబుప్రసాద్, శివసాంబిరెడ్డి, అగస్టిన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ధూళిపాళ్ల రమాదేవి తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

చోరీకి పాల్పడిన పాత నేరస్థుడు అరెస్టు

● బంగారు వస్తువులు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం

గుంటూరు(కార్పొరేషన్), జూలై 30: ఇంట్లో చోరీకి పాల్పడ్డ పాత నేరస్తుడిని అరెస్టు చేసినట్లు మంగళవారం పాత గుంటూరు సీఐ బి.రమేష్ బాబు తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ గుంటూరులోని శివనాగరాజు కాలనీకి చెందిన ఎర్రసాని రాజు అలియాస్ ఇమ్మానుయేల్ దొంగతనాలను వృత్తిగా ఎంచుకొని జీవిస్తున్నాడు. గతంలో నల్లపాడు, అరండల్‌పేట, బెల్లంకొండ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పలు చోరీలకు పాల్పడ్డాడు. తాజాగా పెదకాకాని రోడ్డులోని సీతారామ్‌నగర్ నాలుగో లైనులో నివసిస్తున్న వేణుగోపాల్ ఇంట్లో ఈనెల 27న చోరీ జరిగింది. ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా చొరబడి రెండు గోల్డ్ చైన్లు, ఒక రింగు, రెండు సెల్‌ఫోన్‌లను దొంగిలించాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పాతగుంటూరు పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా కేసు దర్యాప్తు చేశారు. ఈ కేసులో చోరీకి పాల్పడిన నిందితుడిని రాజుగా గుర్తించారు. అతనిని అదుపులోకి తీసుకుని గోల్డ్ చైన్లు, సెల్‌ఫోన్‌లను స్వాధీనపరుచుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ రమేష్ బాబు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐలు భాగ్యరాజు, అమరవర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ యువకుడు మృతి

పొన్నూరు టౌన్, జూలై 30: గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందిన సంఘటన మంగళవారం జరిగింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం కుటుంబ సభ్యులు మందలించటంతో రెండు రోజుల క్రితం అభిరాం అనే యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఈ సంఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

కౌలు రైతు కార్డుల కోసం రైతుల ఫిర్యాదు

● రెవెన్యూ సిబ్బంది అలసత్వంపై ఆగ్రహం



ఫిర్యాదు చేయటానికి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన రైతులు

చేబ్రోలు, జూలై 30: కౌలు రైతు రుణ అర్హత కార్డులు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకునప్పటికీ రోజుల తరబడి తిప్పించుకుంటున్నారే కానీ మంజూరు చేయటంలేదని మంగళవారం చేబ్రోలు రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. చేబ్రోలు రెండో సచివాలయం పరిధిలో కౌలు రైతు రుణ అర్హత కార్డుల కోసం నెల రోజుల క్రితం రైతులు దరఖాస్తు చేసుకుంటే ఆ దరఖాస్తులను స్థానిక వీఆర్వో పట్టించుకోవటం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ వైపు ఖరీఫ్ పంటల సాగు ప్రారంభమయ్యాయని, విత్తనాలు, ఎరువులు, కొనుగోలుకు రైతు భరోసా కేంద్రాల్లో కౌలు రైతు కార్డు చూపిస్తేనే అధికారులు వాటిని ఇస్తారన్నారు. అయితే వీఆర్వో నిర్లక్ష్య వైఖరి కారణంగా పలువురు రైతులకు కౌలు రైతు కార్డులు రాలేదు. దీంతో తహసీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చి నిరసన తెలపటంతో స్పందించిన ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రణతి తక్షణమే రైతులకు కౌలు రైతు కార్డులు మంజూరు చేయాలని వీఆర్వో ప్రమీలను ఆదేశించారు. అంతేకాకుండా శేకూరు వీఆర్వో రాంబాబును కౌలు రైతు కార్డులు మంజూరు బాధ్యతలను పరిశీలించాలని ఆదేశించారు. దీంతో రైతులు నిరసనను విరమించారు.



స్టార్టప్‌లో పాల్గొన్న విద్యార్థినులు

వీవీఐటీలో 'స్టార్టప్ కాంపిటీషన్'

పెదకాకాని, జూలై 30: విద్యార్థులలో దాగున్న నూతన ఆలోచనలను ప్రోత్సహించడానికి, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా స్టార్టప్‌ల (అంకుర సంస్థల) ఏర్పాటుకు మార్గదర్శకం చేయడానికి వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలోని ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐ.ఐ.సి) ఆధ్వర్యంలో స్టార్టప్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ పోటీలలో విద్యార్థులు 20బృందాలుగా ఏర్పడి ఆలోచనలు, మార్కెటింగ్ అవకాశాలు, పరస్పర ప్రయోజనాలు, పెట్టుబడులు ఇతర అంశాలపై రూపొందించిన ప్రాజెక్టును వివరణాత్మకంగా ప్రదర్శించారు. పిల్లలు దూరంగా ఉండే తల్లిదండ్రులు వైద్యసాయం కోసం పికప్ హాస్పిటల్ డ్రాప్ (పీహెచ్‌డీ) పేరుతో రూపొందించిన బోధిధర్మా టీమ్ ప్రదర్శన ఆలోచింపజేసింది. నిషేధిత వస్తువుల వివరాలను తెలియపుస్తూ విద్యార్థులు రూపొందించిన 'ప్రొడక్ట్ ఎవేర్నెస్' యాప్ ఆకట్టుకుంది. అధ్యాపకులు, విద్యార్థుల మధ్య బోధన, బోధనేతర వనరుల సమీకరణ అందించేలా రూపొందించిన ప్రదర్శన మొదటి బహుమతి గెలుచుకుంది. అనంతరం ఈ పోటీలలో పాల్గొని తమ ఆలోచనలను ప్రదర్శించిన విద్యార్థులను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రిన్సిపాల్ వై.మల్లికార్జునరెడ్డి అభినందించారు.

నేడు కొల్లిపర, వల్లభాపురం పరిధిలో విద్యుత్ నిలిపివేత

కొల్లిపర, జూలై 30: మండల పరిధిలోని కొల్లిపర, వల్లభాపురం సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం బుధవారం విద్యుత్‌ను నిలిపి వేస్తున్నట్లు సబ్ ఇంజనీర్ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొల్లిపర సబ్‌స్టేషన్ పరిధిలోని అన్నవరం ఫీడర్‌లో హనుమాన్‌పాలెం, అన్నవరం, బొమ్మువానిపాలెం, తూములూరు గ్రామాల్లో, అదేవిధంగా వల్లభాపురం సబ్‌స్టేషన్ పరిధిలో అత్తలూరిపాలెం, వల్లభాపురం గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్‌ను నిలిపి వేస్తున్నట్లు తెలియజేశారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఆర్యవైశ్య మహాసభ కల్చరల్ చైర్మన్‌గా అవ్వారు

పొన్నూరు టౌన్, జూలై 30: ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కల్చర్ కమిటీ చైర్మన్‌గా అవ్వారు వెంకటేశ్వరరావు మంగళవారం నియమితులైయ్యారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్నిరామసత్యనారాయణ జంగారెడ్డిగూడెంలో అవ్వారు వెంకటేశ్వరరావుకు నియామకపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీలో నియమితులైన అవ్వారును పొన్నూరు పట్టణానికి చెందిన బాపనపల్లి ప్రభాకర లక్ష్మీప్రసాదరావు, నంబూరు నాగభూషణరావు, రాచపూడి విఘ్నేశ్వరరావు, వెంకటసాంబశివరావు, అవ్వారు సుబ్బారావు, బొలిశెట్టి రోశయ్యగుప్తా, కోట రవిశంకర్, తాటికొండ సుధీర్, లింగమల్లు మోహనకృష్ణ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.